ప్రజాగళం ప్రతిధ్వనించింది



ఈ రోజు అర్ధరాత్రి 12 గంటలతో.. 2024వ సంవత్సరం కాలగర్భంలో కలిసి పోతుంది. కోటి ఆశలతో 2025 పురుడు పోసుకుంటుంది. జగన్ అరాచక పాలనకు చరమ గీతం పాడి.. మోదీ-చంద్రబాబు-పవన్‌ల కూటమికి అధికారం కట్టబెట్టిన ఈ సంవత్సరం ఎన్నో జ్ఞాపకాలను తనలో నిలుపుకుంది. ప్రకృతి వైపరీత్యాలు ప్రజలకు తీరని వేదనను కలిగించాయి. వెళ్లిపోతున్న వత్సరంలో ముఖ్య సంఘటనల కేలండర్‌ను ఈ రోజు జ్ఞాపకం చేసుకుందాం. 6లో..

మా గోడు పట్టదా..?

ముస్సిపల్ కార్మికులు, ఉద్యోగులు దీర్ఘకాలంగా తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ తమను నమ్మించి మోసగించిందని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని పోరుబాటకు సన్నద్ధమవుతున్నారు.

- అరకొర జీతాలతో ఇబ్బందులు
- పలు సమస్యలతో సతమతం..
- ఐదేళ్లుగా పరిష్కారం కోసం ఎదురుచూపులు
- మొండిచెయ్యి చూపిన వైసీపీ ప్రభుత్వం
- పట్టని కూటమి ప్రభుత్వం
- మున్సిపల్ కార్మికుల ఆవేదన
- పోరుబాటకు కార్యాచరణ
- జనవరి 3న మున్సిపల్ కార్యాలయాల వద్ద, 10న కలెక్టరేట్ వద్ద ధర్నాలు

ఏలూరు టూటౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు, అరకొర వేతనాలతో కుటుంబాన్ని పోషించుకోలేక సతమతమవుతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదు. మీ సమస్యలు పరిష్కరిస్తామంటూ ఇదిగో అదిగో అంటూ ఐదేళ్లు కాలక్షేపం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు, తమ సమస్యల పరిష్కారం కోసం 2023 డిసెంబరు 26నుంచి 2024 జనవరి 10వ తేదీ వరకు 16 రోజుల పాటు రాష్ట్రవ్యాప్త సమ్మె నిర్వహించారు. అప్పటి వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో సమస్యలు పరిష్కారిస్తామంటూ ఒప్పందం చేసుకుని సమ్మె విరమింపజేశారు. అనంతరం ఏ ఒక్క హామీకి జీవో ఇవ్వలేదు. ఈలోపులో ఎన్నికలు రావడంతో వైసీపీ ఓటమి చెంది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ సమస్యలు పరిష్కారం అవుతాయని భావించారు. ఆరునెలలు గడిచినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఉద్యోగులు, కార్మికులు తీవ్ర నిరాశతో మళ్ళీ ఉద్యమానికి సమాయత్తం అవుతున్నారు.

- కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ రూపొందించారు. ఈ ఏడాది జనవరి 26న మస్తర్ పాయింట్ల వద్ద ధర్నాలు నిర్వహించారు. వచ్చే జనవరి 3న మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు, జనవరి 10న కలెక్టరేట్ వద్ద ధర్నాలు చేయాలని నిర్ణయించారు. అప్పటికి పరిష్కారం కాకపోతే రాష్ట్రవ్యాప్త సమ్మెకు సిద్ధమని ప్రకటించారు.

పర్మినెంట్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలు

- గత మూడేళ్లగా పెండింగులో ఉన్న యూనిఫాంలు, చెప్పులు, సబ్బులు, కొబ్బరినూనె ఇవ్వాలి.
- మూడేళ్ల సరండర్ లీవ్‌ల వేతనాలు చెల్లించాలి.
- ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాలు తెరచి వారి జీతాల నుంచి మినహాయించిన సొమ్మును ఆ ఖాతాలో జమ చేయాలి.
- 11వ పీఆర్సీ ఎరియర్ డీఏలు, ఇంక్రిమెంట్లు, ఏపీజీఎల్ఐ సొమ్మును చెల్లించాలి.

అప్కాస్ కార్మికుల సమస్యలు

- అప్కాస్ కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.75 వేలు ఇస్తామన్న హామీకి జీవోలు ఇవ్వాలి.
- ఉద్యోగం చేస్తూ మరణించిన వారి కుటుంబాలకు దహన సంస్కారాల ఖర్చులు రూ.20 వేలకు పెంచాలి.
- రిటైర్‌మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలి.
- సర్వీసులో చనిపోయిన రిటైర్ అయినా ఉద్యోగుల వారసులకు ఉద్యోగాలివ్వాలి.
- సర్వీస్‌లో ఉండగా చనిపోయిన వారసులకు ఎక్స్‌గ్రేషియా బకాయిలు రూ.5లక్షలు చెల్లించాలి.
- ప్రమాదవశాత్తూ చనిపోతే ఎక్స్‌గ్రేషియా రూ.7లక్షలు పెంచాలి.
- సంక్షేమ పథకాలు అమలు చేయాలి.



ఏలూరులో ధర్నా నిర్వహిస్తున్న మునిసిపల్ కార్మికులు (ఫైల్)

సమస్యలు పరిష్కరించాలి



కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలి. 12వ పీఆర్సీ ప్రకటించాలి. మధ్యంతర భృతి ఇవ్వాలి. వైసీపీ ప్రభుత్వ హయాంలో సమ్మెకాలపు ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలి. కార్మికుల వేతనాలు పెంచాలి.

- బి.సోమయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

పాఠశాల ఆయాలు, శానిటరీ వర్కర్లు..

- స్కూల్ స్వీపర్లు, శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనం రూ.15వేలు పెంచాలి.
- పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలి.
- మాస్కులు, గ్లౌజులు, రక్షణ పరికరాలు ఇవ్వాలి. 5వ తేదీ లోపు వేతనాలు ఇవ్వాలి.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు..

- మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు కనీసం వేతనం రూ.21 వేలు ఇవ్వాలి.
- స్కిల్డ్ సెమిస్కిల్డ్ కార్మికులకు వేతనాలు అమలు చేయాలి.
- రిస్క్ అలవెన్సులు, టైల్‌కిట్స్ యూనిఫాంలు ఇవ్వాలి. వారంతపు సెలవులు, జాతీయ పండుగ సెలవులు, పీఎల్‌లు అమలు చేయాలి.

మంత్రి నిమ్మల పిటిషన్‌పై విచారణ 7కి వాయిదా

అమరావతి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):తనపై ఏలూరు ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టులో ఉన్న కేసును కొట్టివేయాలని కోరుతూ జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వేసిన పిటిషన్ పై విచారణను హైకోర్టు జనవరి 7కి వాయిదా వేసింది. ఫిర్యాదు దారుడు బండి రమేష్‌కు నోటీసులు జారీచేసింది. ఈ మేరకు కోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాలకొల్లు పట్టణంలో టిడ్కో ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులకు ఇవ్వడంలేదంటూ 2022లో నిమ్మల రామానాయుడు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామానాయుడు, అతని అనుచరులు తనపై దాడి చేసి కులం పేరుతో దూషించారని పాలకొల్లు వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండి రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా రామానాయుడుతోపాటు మరో 25 మందిపై 2022 ఆగస్టు 5న కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు పూర్తి చేసి ఎస్సీ ఎస్టీ ప్రత్యేక కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణ నిమిత్తం ఆ చార్జ్‌షీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకొంది. ఈ నేపథ్యంలో తనపై కేసును కొట్టివేయాలంటూ రామానాయుడు హైకోర్టును ఆశ్రయించారు.

జనసేన గూటికి జయమంగళ

కండువా కప్పి ఆహ్వానించిన పవన్

కైకలూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):ఎట్టకేలకు ఉత్కంఠ వీడింది. నెల రోజులుగా ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ జనసేనలో చేరతారా.. లేదా.. అన్న సందేహానికి సోమవారంతో ముగింపు పలికారు. మంగళగిరిలోని జనసేన రాష్ట్రపార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమక్షంలో జయమంగళ జనసేన తీర్థం తీసుకున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మాజీ ఎమ్మెల్సీ బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జయమంగళ మాట్లాడుతూ ఇన్ని రోజులు అధికారం లేకనే ప్రజలకు సరైన సేవలందించ లేకపోయానని ప్రజల శ్రేయస్సు కోసం జనసేనలో చేరానని ప్రజలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉండి ఇకపై చిత్తశుద్ధితో పని చేస్తానన్నారు. కైకలూరు నియోజకవర్గంతో పాటు కొల్లేరు ప్రజల సమస్యలను పవన్‌కల్యాణ్‌కు వివరించానన్నారు. చట్టసభల్లో కొల్లేరుకు సంబంధించిన నాయకులు లేకపోవడంతో చెరువులను ధ్వంసం చేశారని, ప్రజలు రవాణాకు సరైన రోడ్లు సౌకర్యాలు లేవని, ఎక్కడైనా రహదారి నిర్మాణం చేపడితే ఫారెస్టు అధికారులు అడ్డుకుంటున్నారని, ట్రైబల్ ఏరియాకంటే అత్యంత దారుణమైన పరిస్థితుల్లో కొల్లేరు ప్రజలు ఉన్నారని వివరించినట్టు తెలిపారు. దీనిపై పవన్‌కల్యాణ్ స్పందిస్తూ వచ్చే ఫిబ్రవరి లో కొల్లేరు పర్యటనకు వస్తానని ప్రజలకు, పక్షులకు న్యాయం చేసేలా చేస్తానని హామీ ఇచ్చినట్టు వెల్లడించారు.



జనసేన పార్టీలోకి జయమంగళకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న పవన్ కల్యాణ్

నేటి నుంచే పింఛన్ల పంపిణీ

- జిల్లాలో 2,62,228 మంది పింఛన్‌దారులకు రూ.113 కోట్లు పంపిణీకి ఏర్పాట్లు

ఏలూరుసిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):ఒకరోజు ముందుగానే 2025 జనవరి నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను ఇంటింటికీ పంపిణీ చేయడానికి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. తొలిరోజునే నూరుశాతం పింఛన్లను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి 1వ తేదీ నూతన ఆంగ్ల సంవత్సరం తొలిరోజు కావడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు డిసెంబరు 31వ తేదీ మంగళవారం ఉదయం 6 గంటల నుంచి పెన్షన్ పంపిణీ ప్రారంభమవుతుంది. జిల్లాలోని 2లక్షల 62వేల 228 మంది లబ్ధిదారులకు రూ. 113 కోట్ల 82వేల 500 పంపిణీ చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

జిల్లాలో పంపిణీ చేసే పింఛన్ల వివరాలు

పింఛన్ రకం	లబ్ధిదారుల సంఖ్య	పింఛన్ మొత్తం
అభయహస్తం	4,668	23,78,500
అమరావతి లాండ్‌లెస్‌పూర్	9	50,000
డప్పుకళాకారులు	2,050	82,64,000
విభిన్నప్రతిభావంతులు	33,341	20,14,50,000
మత్స్యకారులు	6,215	2,51,44,000
కళాకారుల పెన్షన్	167	6,72,000
వృద్ధాప్య	1,31,826	52,73,04,000
సైనిక్‌వెల్ఫేర్	16	80,000
సింగిల్ ఉమెన్	8,285	3,34,12,000
తలసేమియా	74	7,40,000
కల్లుగీత కార్మికులు	4,578	1,83,12,000
చర్మకారులు	1691	67,64,000
ట్రాన్స్‌జెండర్	76	3,16,000
నేత కార్మికులు	1,129	45,64,000
వితంతు	67,817	2,73,12,000
సికెడియు (ప్రభుత్వ)	231	23,30,000
సికెడియు(ప్రైవేటు)	343	3,440,000
డిఎంఅండ్‌హెచ్‌ఓ	1,984	2,63,50,000
మొత్తం	2,62,228	1,13,00,82,500

సమస్యలపై సత్వర పరిష్కారం : కలెక్టర్



వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో అందిన అర్జీల పరిష్కారం జవాబుదారీతనంతో ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం అర్జీదారుల నుంచి 207 అర్జీలను స్వీకరించారు. జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ్‌రాజు, డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేయవద్దు..

ఏలూరు క్రైం : నూతన సంవత్సరం సందర్భంగా కొంత మంది సైబర్ నేరగాళ్లు ఎదుటి వారికి గ్రీటింగ్స్ తెలియజేయాలంటే ఏపీకే యాప్‌ను వాడితే మీ ఫొటోతో ఉండే శుభాకాంక్షలు ఎదుటి వారికి తెలపవచ్చని నమ్మబలికి లింకులను పంపిస్తున్నారని ఇలాంటి ఏపీకే లింకుల యాప్‌లను ఓపెన్ చేయవద్దని నూజివీడు డీఎస్పీ ప్రసాద్ జిల్లా ప్రజలకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించి ఫిర్యాదులు స్వీకరించారు.

ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్



డిసెంబర్ నెల కూపన్ నంబర్ - 3

పాఠకుని పూర్తి పేరు	:	....
డోర్ నెంబరు	:	....
వీధి పేరు	:	....
గ్రామం / పట్టణం	:	....
మండలం	:	....
జిల్లా	:	....
పోస్టల్ పిన్‌కోడ్	:	....
ఫోన్ నంబర్	:	....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది డిసెంబర్ నెల మూడవ కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి మీ వద్దనే ఉంచి మూడు నెలలు అయిన తర్వాత మొత్తం 9 కూపన్లను మూడు సెట్లుగా చేసి 2025 మార్చ్ నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.

నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.

* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.



కూపన్లు పంపవలసిన చిరునామా

ఆంధ్రజ్యోతి కార్యాలయం :
రాచర్ల రోడ్, అలంపురం, తాడేపల్లిగూడెం,
పశ్చిమగోదావరి జిల్లా - 534166.
బి.యం.: 9985411541, ఎ.సి.యం.: 9985411552

10 నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):పాఠశాలలకు సంక్రాంతి సెలవులపై విద్యాశాఖ స్పష్టతనిచ్చింది. ఇప్పటికే విడుదల చేసిన అకడమిక్ కేలండర్ (2024-25) ప్రకారం జనవరి 10 నుంచి 19 వరకు పండుగ సెలవులుంటాయి. మైనార్టీ విద్యాసంస్థలకు జనవరి 11 నుంచి 15 వరకు సెలవులు ఉంటాయి.

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యానికి మేలు : కలెక్టర్

ఏలూరుసిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):సేంద్రియ ఆహారం, ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పేర్కొన్నారు. స్థానిక గోదావరి సమావేశ మందిరం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన సేంద్రియ ఉత్పత్తుల విక్రయశాలను జేసీ ధాత్రిరెడ్డితో కలిసి కలెక్టర్ సందర్శించారు.ప్రతి సోమవారం సేంద్రియ ఉత్పత్తులపై అవగాహన, ప్రోత్సహించేందుకు కలెక్టర్ సూచనల మేరకు ప్రకృతి వ్యవసాయం చేస్తున్న సహకారంతో ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయా సేంద్రియ ఉత్పత్తుల విక్రయశాలలో ఉత్పత్తుల ప్రత్యేకతను నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కొన్ని ఉత్పత్తులను కలెక్టర్, జేసీ కొనుగోలు చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు సాగుచేసిన ఉత్పత్తులు ప్రజలకు మేలు చేస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. అక్కడ ఉన్న పలు సేంద్రియ కూరగాయలు, తేనె, ఇతర ఉత్పత్తులను పరిశీలించి వాటిని ఏఏ ప్రాంతాల నుంచి తీసుకొచ్చారో ఆరా తీశారు.

479 గ్రామ సభలు.. 4,831 అర్జీల స్వీకరణ

జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరుసిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి):ఏలూరు జిల్లాలోని 28 మండలాల్లో మొత్తం 665 రెవెన్యూ గ్రామాలు వుండగా జిల్లాలో ఇప్పటివరకు 479 గ్రామ రెవెన్యూ సదస్సులలో 4,831 అర్జీలు స్వీకరించటం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. ఈ అర్జీలలో ఇప్పటికే 1793 అర్జీలు పరిష్కరించబడ్డాయన్నారు. ఈ సదస్సులకు 19,874 మంది హాజరయ్యారని తెలిపారు.


ఈ ఏడాది వరద ఉధృతికి.. చేలన్నీ నదులయ్యాయి



వేమగిరిలో జరిగిన టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సభలో ప్రధాని మోదీ, లోకేశ్, పవన్‌కల్యాణ్, పురందేశ్వరి, శ్రీనివాసవర్మ, దుర్గేష్ తదితరులు


పెదవాగు గండితో వేలేరుపాడు అతలాకుతలం

జ్ఞాపకాలు 2024

ప్రజాగళం ప్రతిధ్వనించింది

జగన్ పాలనకు చరమగీతం మోదీ-చంద్రబాబు-పవన్‌ల కూటమికి అధికారం

ఎన్నో ఆశలు.. ఆకాంక్షలను ఊరిస్తూ ఏడాది క్రితం వచ్చిన 2024వ సంవత్సరం సోమవారంతో వెళ్లిపోతోంది. ఈ ఏడాది జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గతిని మార్చాయి. ప్రజలు వైసీపీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడారు. టీడీపీ- జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వాన్ని ఆదరించారు. ప్రజలు స్వేచ్ఛను అనుభవించారు. ఈ రోజుతో గుడ్‌బై చెబుతున్న వేళ.. ఈ ఏడాది ఎప్పుడు ? ఎక్కడ ? ఏం జరిగింది ? ఓ సారి మననం చేసుకుందాం. రేపటి 2025లోకి ప్రవేశిద్దాం.

జనవరి-24

- 7:టీడీపీ అధినేత మాజీ సీఎం చంద్రబాబు నాయుడు ఆచంటలో రా కదలిరా సభలో పాల్గొని 90 రోజుల్లో జగన్ సర్కార్ పతనమవుతుందని హెచ్చరించారు. అన్నట్టుగానే ఆయన మాట నిజమైంది.
- 12: నరసాపురం సముద్ర తీరంలో వేసిన 50 మీటర్ల మేర గట్టు నీటికి కొట్టుకుపోయింది. పలుమార్లు ఇలాగే జరిగింది. దీనికి వెచ్చించిన నిధులు నీటిపాలయ్యాయి. ప్రతిపక్ష పార్టీల నేతలు దీనిపై ఆందోళన చేశారు.
- 13: నరసాపురం వైసీపీ ఎంపీ కనుమూరి రఘు రామ కృష్ణరాజు నాలుగేళ్ల తర్వాత తొలిసారిగా నియోజకవర్గంలో అడుగుపెట్టారు. ఈయనను రాకుండా జగన్ సర్కార్ వేధింపు చర్యలకు పాల్పడింది.
- 22: సీఎం క్యాంపు కార్యాలయ ముట్టడికి 'అంగన్‌వాడీల చలో విజయవాడ'పై జగన్ సర్కార్ ఉక్కుపాదం మోపింది. వారిని వెళ్లనీయకుండా అడ్డుకుంది.
- 25: ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఏలూరులో జిల్లాలో పర్యటించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించి జగన్ గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు.
- 25: పానీపూరి తిని జంగారెడ్డిగూడెంలో నంద్యాలకు చెందిన ఇద్దరు చిన్నారులు మృతి చెందారు.
- 28: ద్వారకా తిరుమల మండలం దేవినేనివారిగూడెంలో పెద్ద పులి సంచారం.. రెండు ఆవులు, దూడపై దాడి.

ఫిబ్రవరి-24

- 1: భీమవరంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఎన్నికల శంఖారావం పూరించి.. వైసీపీ విధ్వంసకర పాలనపై విరుచుకుపడ్డారు.
- 3: ఏలూరు శివారు మల్కాపురం వద్ద సీఎం జగన్ నిర్వహించిన 'సిద్ధం' ఎన్నికల సభలో ఏర్పాట్లు సరిగా లేక జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తనకు మరోసారి అధికారం ఇవ్వాలని ఆయన కోరారు.
- 5: చింతలపూడిలో 'రా.. కదలిరా' టీడీపీ బహిరంగ సభ జరిగింది. సభకు చంద్రబాబు హాజరై వైసీపీ ప్రభుత్వ ఆరాచకాలపై ధ్వజమెత్తారు.
- 8: విజయవాడ మహాధర్నాకు వెళ్లకుండా ఆశా కార్యకర్తలను పోలీసులు నిర్బంధించారు. బస్సుల్లో వెళ్తున్న వారిని దించి పోలీస్ స్టేషన్‌లకు తరలించారు.
- 8: పోతునూరులో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల బహిరంగ సభ. సీఎం జగన్ పాలనా తీరుపై ధ్వజం.
- 20: నరసాపురం మండలం పీఎం లంకలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటన
- 21: జనసేన అధినేత పవన్ కల్యాణ్ భీమవరంలో పర్యటన. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వచ్చిన టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జులు ఆయనను కలిశారు.
- 27: ఏలూరులో పోలింగ్ బూత్ ఏజెంట్లతో నిర్వహించిన సభలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు.
- 28: ప్రత్తిపాడు వద్ద టీడీపీ-జనసేన ఉమ్మడి ఎన్నికల సభ నిర్వహించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ హాజరై గెలిపించాలంటూ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

మార్చి-24

- 5: ముసునూరు మండలం రమణక్కపేటలో పంచాయతీ స్థలాన్ని ఆక్రమించుకుని వైసీపీ కార్యకర్తలు ఇల్లు కడుతున్నారని టీడీపీ కార్యకర్త స్పందనలో ఫిర్యాదు చేయడంతో అతనిపై వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు.
- 11: తనపై తప్పుడు కేసు పెట్టారని, న్యాయం చేయాలని కోరిన వ్యక్తి నుంచి రూ.25 వేలు లంచం తీసుకుంటూ నరసాపురం ఎస్‌ఐ, రైటర్‌ను ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు.
- 16 : మోగిన నగారా 4వ దశలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలును కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఏపీలో ఏప్రిల్ 18న నోటిఫికేషన్, మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ తేదీలను ప్రకటించింది.
- 26 బైక్‌ను తప్పించబోయి ఆటో పల్టీ.. ఇద్దరి మృతి.. ముగ్గురికి గాయాలు.
- 27: టి.నరసాపురం మక్కినవారిగూడెం, తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి, పెంటపాడు పడమరవిప్పర్రు, నిడమర్రులలో చంద్రబాబు అరెస్ట్‌తో గుండె ఆగి చనిపోయిన కుటుంబాలను నిజం గెలవాలి యాత్రలో భాగంగా నారా భువనేశ్వరి పర్యటించి పరామర్శించారు.

ఏప్రిల్-24

- 5: భీమవరం, నరసాపురం పాలకొల్లులో నిర్వహించిన ప్రజాగళం సభల్లో చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. జగన్‌ను ఓడించకపోతే జరిగే నష్టాలను వివరించారు. పాలకొల్లులో ఐటీ పార్కు పెడతానని హామీ ఇచ్చారు.
- 16: మండుటెండలో జగన్ బస్సు యాత్ర ప్రజలకు చుక్కలు చూపించింది. భీమవరంలో నిర్వహించిన సిద్ధం సభలో జగన్ మాట్లాడుతూ ఆది నుంచి చంద్రబాబు, పవన్‌పై వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారు. జనం మెల్లమెల్లగా జారుకున్నారు.
- 18 ఏలూరు, నరసాపురం ఎంపీ స్థానాలతోపాటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజక వర్గాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది.
- పశ్చిమగోదావరి జిల్లాలో ఎంపీకి నలుగురు, ఎమ్మెల్యేలకు 21 మంది నామినేషన్ పత్రాలు సమర్పించారు.
- 21: నరసాపురం, భీమవరం పట్టణాల్లో జనసేనాని పవన్ కల్యాణ్ నిర్వహించిన రోడ్ షోలో అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపుతానని ప్రకటించారు.
- 26: జంగారెడ్డిగూడెం మండలం వేగవరం సమీపంలోని జల్లేరువాగులో చేపల వేటకు వెళ్లి ముగ్గురు మృత్యువాత.

మే-24

- 6 వేమగిరిలో జరిగిన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఎన్నికల సభలో ప్రధాని మోదీ నిర్వహించిన కూటమి ప్రజాగళం సభ దద్దరిల్లింది. కేంద్రంలోను, రాష్ట్రంలోను మనమే గెలుస్తున్నామని మోదీ ప్రకటించి ఎన్నికల శంఖారావం పూరించారు.
- 13 పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు జరిగిన పోలింగ్‌లో ఓటర్లు పోటెత్తారు. రాత్రి పది గంటలు దాటినా ఓటర్లు క్యూలో నిలబడ్డారు. అంచనాలకు మించి ఓటింగ్ నమోదైంది. పశ్చిమ గోదావరిలో 81.12 శాతం, ఏలూరు జిల్లాలో 83.04 శాతం పోలింగ్ నమోదైంది.
- 15 కుక్కునూరు మండలం దామరచర్ల పంచాయతీ పరిధి కురుములతోగులో డయేరియాతో వృద్ధురాలు మృతి చెందగా మరో ఎనిమిది మంది అస్వస్థత.
- 27 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, విజయ డెయిరీ డైరెక్టర్ యెర్నేని సీతాదేవి హైదరాబాద్‌లోని తన కుమార్తె నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు.
- 31 ఏలూరులో ప్రేమించడం లేదని యువతిని ఓ ప్రేమోన్మాది కత్తితో నరికి చంపాడు. ఆపై అదే కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

జూన్-24

- 5 తెలుగుదేశం-జనసేన-బీజేపీ పార్టీల కూటమి కుమ్మేసింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని నరసాపురం, ఏలూరు, రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానాలు, 15 అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. జనసునామీలో వైసీపీ గల్లంతు.. ఆ పార్టీ ఒక్కచోట కూడా తమ స్థానాన్ని నిలబెట్టుకోలేదు.
- 10 : నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మ మోదీ ప్రభుత్వంలో చోటు దక్కింది. కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు మంత్రిత్వ శాఖ సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.
- 12 : పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా, నిడదవోలు ఎమ్మెల్యే కందుల దుర్గేష్ పర్యాటక శాఖ మంత్రిగా, నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సమాచార శాఖ మంత్రిగా చంద్రబాబు కేబినేట్‌లో చోటు దక్కించుకున్నారు.
- 17 : పోలవరం ప్రాజెక్టును సీఎం చంద్రబాబు నాలుగు గంటల పాటు పరిశీలించి.. పనుల పురోగతిపై సమీక్ష.
- 21 : పెదవేగి మండలానికి చెందిన నలుగురు యువకులు బాపట్ల జిల్లా రామాపురం బీచ్‌లో విహారానికి వెళ్లారు. ఇద్దరి మృతి.. మరో ఇద్దరు గల్లంతు.
- 22 : పశ్చిమ గోదావరి కలెక్టర్‌గా చదలవాడ నాగరాణి, ఏలూరు జిల్లా కలెక్టర్‌గా వెట్రిసెల్వి నియామకం.

జూలై-24

- 1 : ఉమ్మడి జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ. ఏప్రిల్, మే, జూన్ నెలలకు పెంచిన మొత్తం రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు పంపిణీ చేశారు.
- 3 : ఒకేసారి పట్టిసీమ, తాడిపూడి నీటిని విడుదల చేసిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు
- 16 : నరసాపురం ఎంపీడీవో ఒత్తిళ్లు తట్టుకోలేక భార్యకు మెసేజ్ చేసి ఏలూరు కాల్వలో దూకి ఆత్మహత్య.. వారం తర్వాత మృతదేహం లభ్యం.
- 18 : భారీ వర్షాలతో పల్లపు ప్రాంతాలు జలమయం డెల్టాలో ముంపు.. వేలేరుపాడు, కుక్కునూరు, ఏజెన్సీలో పొంగిన వాగులు.. పొంగిన వాగు.. కొట్టుకుపోయిన కారు
- 19 : వేలేరుపాడును ముంచేసిన పెద్ద వాగు.. మొరాయించిన మూడో గేటు.. భారీ గండి.. గుట్టలెక్కి ప్రాణాలు కాపాడుకున్న జనం
- 20 : ఉమ్మడి పశ్చిమలో మూడు దారుణ హత్యలు.. ద్వారకా తిరుమలలో మామను కడతేర్చిన అల్లుడు.. కామవరపుకోట మండలం తడికలపూడిలో తండ్రిని కడతేర్చిన కుమారుడు.. వేములదీవిలో ఒకరిని కత్తితో నరికి చంపిన ఒంటరి మహిళ
- 24 : ఎర్ర కాలువ వరదకు నీటమునిగిన తాడేపల్లిగూడెం మండలం నందమూరులో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పర్యటించారు.


తాడేపల్లిగూడెం సభలో చంద్రబాబు-పవన్ అభివాదం

ఆగస్టు-24

- 1 : ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించి, సంబరాలు చేసుకున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి.
- 8 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.
- 12 : ఉమ్మడి పశ్చిమ రైతులకు రూ.472 కోట్ల ధాన్యం బకాయిల సొమ్మును రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఏలూరులో విడుదల చేశారు.
- 16 : అన్ని ప్రధాన పట్టణాల్లో అల్పాహారంతో అన్న క్యాంటీన్లు ప్రారంభం. నెరవేరిన కూటమి హామీ.
- 25 : వందేభారత్ రైలుకు ఏలూరులో హాల్ట్ కల్పించారు.
- 28 : నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో వందలాది మంది విద్యార్థులు విష జ్వరాలు, వాంతులు, విరేచనాలతో ఆసుపత్రుల్లో చికిత్స.. క్యాంటీన్ నిర్వహణపై ఆందోళన.. ఉన్నతాధికారుల పర్యటన.

సెప్టెంబరు-24

- 1: వరద నీటితో రామిలేరు పోటెత్తింది. అప్పన్నవీడు అతలాకుతలమైంది. వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.
- 11: ఏలూరులో సీఎం చంద్రబాబు పర్యటించారు. వరదలో నష్టపోయిన ఏ ఒక్కరికీ లోటు రానివ్వనని హామీ. కాల్వలు, డ్రెయిన్లలో పూడిక తీయిస్తామన్నారు.
- 21: తిరుపతి లడ్డూ కల్తీపై జనాగ్రహం.. ఉమ్మడి జిల్లాలో ర్యాలీలు, జపాలతో నిరసనలు.
- 22: ఏలూరు ఆశ్రం విద్యార్థుల విహార యాత్ర విషాదాంతం. మారేడుమిల్లి వెళ్లిన విద్యార్థులు చూస్తుండగానే వాగులో కొట్టుకుపోయారు. ఐదుగురు గల్లంతు.
- 24: ట్రైకార్ ఛైర్మన్‌గా బొరగం శ్రీనివాస్, వినియోగదారుల రక్షణ కౌన్సిల్ ఛైర్మన్‌గా పీతల సుజాత, ఏపీఐఐసీ ఛైర్మన్‌గా మంతెన రామరాజు నియామకం.
- 28: సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం స్వస్తి.

అక్టోబరు-24

- 14: లాటరీలో మద్యం షాపుల కేటాయింపు. అనేక మంది కోట్లలో నష్టపోయారు. ఎమ్మెల్యేలు, అనుకూలురుకు కేవలం ఒకటి రెండు దుకాణాలే దక్కాయి.
- 16: నిధుల దుర్వినియోగం కేసులో ద్వారకాతిరుమల సర్పంచ్‌పై వేటు. ఉప సర్పంచ్‌కు బాధ్యతలు.
- 17: మునిసిపల్ టీచర్ల సమస్యల పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏలూరు డీఈవో కార్యాలయం ఎదుట దీక్ష.
- 18 : ఏలూరు మార్చురీలో ఒక వ్యక్తి మృతదేహాన్ని ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మాయం చేస్తుండగా అడ్డగింత..
- 30: ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో దీపావళి మందుల తయారీ షెడ్డుపై పిడుగు.. ఘటనా స్థలంలో ఇద్దరు, చికిత్స పొందుతూ ఐదుగురు మృతి.

నవంబరు-24

- 2: ఏలూరులో స్కూటర్‌పై ఇద్దరు యువకులు గోనె సంచిలో ఉల్లి బాంబులు తీసుకుని వెళుతుండగా అవి పేలి ఒకరు మృతి, ఎనిమిది మందికి గాయాలు.
- 4: ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ ఫ్లెక్సీ కడుతుండగా విద్యుదాఘాతంతో నలుగురు యువకులు మృతి.
- 6: భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నివాసంలో ఆదాయపు పన్ను శాఖ అధికారుల దాడుల, ఫైళ్ల సీజ్.
- 9: ప్రభుత్వ సలహాదారుగా ఎంఏ షరీఫ్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్‌గా కొత్తపల్లి సుబ్బారాయుడు, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కనకరాజు సూరి, ఆర్టీసీ విజయవాడ జోన్ ఛైర్మన్‌గా రెడ్డి అప్పలనాయుడు నియమితులయ్యారు.
- 24 దేశవ్యాప్తంగా అత్యధిక వాయు కాలుష్యం ఉన్న 118 పెద్ద, మధ్యతరహా నగరాలు, పట్టణాల జాబితాలో ఏలూరు కార్పొరేషన్ చేరింది.
- 27: తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి రాష్ట్రంలోనే అత్యుత్తమ అవార్డు లభించింది.

డిసెంబరు-24

- 2: వైసీపీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి ఆళ్ల నాని సైకిల్ ఎక్కడానికి ప్రయత్నాలు చేస్తున్నారు వైసీపీ జిల్లా అధ్యక్ష పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి గతంలోనే రాజీనామా చేసిన సంగతి తెలిసిందే..
- 6: చేపల చెరువుల లీజు బకాయిలు చెల్లించాలని శ్రీపర్రు, కోమటిలంక గ్రామస్థులు కొండలరావుపాలెంలో మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటిని చుట్టుముట్టారు.
- 9: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ విజేతగా గోపిమూర్తి ఎన్నిక.
- 12: వైసీపీ మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రాజీనామా.
- 13: నరసాపురంలోని ఏటిగట్టుపై కంపోస్టు యార్డు దారుణమని.. కాలుష్య కారకమని కాలుష్య నియంత్రణ మండలి బోర్డు అసహనం.
- 16: సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు సందర్శన.. 2026 అక్టోబరుకు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.
- 20 : ఉండి మండలం యండగండిలో తులసి అనే మహిళ ఇంటికి ఓ వ్యక్తిని చంపి మృతదేహాన్ని ఆమె సోదరి, మరిది, అతని ప్రియురాలు కలిసి డోర్ డెలివరీ చేసిన ఘటనలో ముగ్గురిని అరెస్ట్ చేశారు.


నిడమర్రులో బాధిత కుటుంబానికి భువనేశ్వరి పరామర్శ


ఏలూరులో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సభ


బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, వర్మ శంఖారావం


సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు వద్ద పరిశీలన


పెట్టెలో మృతదేహం కేసులో నిందితుల అరెస్ట్

సేవకు వేళాయె..!

- » మేము సైతం.. ద్వారకా తిరుమల చినవెంకన్న సన్నిధిలో సేవకు
- » మానవ సేవే మాధవ సేవ అని తరిస్తున్న స్వయం సేవకులు


భక్తులకు వడ్డన చేస్తున్న సేవకులు

ద్వారకాతిరుమల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మానవ సేవే మాధవ సేవ అనే నానుడిని హిందూ సనాతన ధర్మ గొప్పదనంగా చెబుతారు. దీని ఆధారంగా సుదూర ప్రాంతాల నుంచి క్షేత్రానికి వచ్చే యాత్రికులకు సేవ చేస్తే సాక్షాత్తు ఆ దైవానికి సేవ చేసిన ఫలం దక్కుతుందని భావన. సాధారణంగా ఆ స్వామికి నేరుగా సేవచేసే భాగ్యం ఎవరికీ ఉండదు. దీంతో ఆ దేవదేవుని దర్శించుకునేందుకు అష్టకష్టాలు పడి వచ్చే భక్తులకు క్షేత్రంలో అన్ని విధాలా సౌకర్యం కల్పిస్తే ఆ దేవదేవుని అనుగ్రహం దక్కుతుందన్న ఆలోచన నుంచే సేవాగుణం వచ్చిందని చెప్పొచ్చు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పుణ్యక్షేత్రమైన చినవెంకన్న ఆలయానికి నిత్యం వేలాదిమంది భక్తులు స్వామి దర్శనార్థం వస్తుంటారు. వీరికి సేవలందించేందుకు సిబ్బంది సరిపోరు. దీంతో నిస్వార్థంగా సేవ చేసేందుకు స్వయం సేవకులు కంకణబద్ధులయ్యారు. ఇక్కడికి వచ్చే శ్రీవారి సేవకులు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి నిత్యం క్షేత్రానికి వచ్చి నిష్కళంకమైన సేవను ప్రతిఫలం ఆశించకుండా అందిస్తున్నారు. ప్రతీ రోజూ వందమందికి తగ్గకుండా స్వామి సేవకు ఈ సేవకులు వస్తుంటారు. అదే భక్తులు ఎక్కువగా వచ్చే రోజులైన శని, ఆది, ఇతర పర్వదినాల్లో వీరిసంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ సేవాభావం వారి ఆధ్యాత్మిక జీవితాన్ని ఉత్తేజపర్చడమే కాకుండా తోటి భక్తులకు ప్రేమ, అప్యాయతతో సేవ చేసే ఫలం దక్కుతుంది. భగవంతుని చిత్తానికి అనుగుణంగా పనిచేసేందుకు ఈ సేవాగుణం వారి శరీరాన్ని, ఆత్మను సిద్ధం చేస్తుందనడంలో సందేహం లేదు. శ్రీవారి స్వయంసేవకులు ఇక్కడ దర్శనం క్యూలైన్లు జరపడం, భక్తులకు అన్నప్రసాదాన్ని సక్రమంగా అందజేయడం, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో మంచినీరు అందించడం, ఆలయ ప్రాంగణంలో పలు ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి సేవలందిస్తుంటారు.


వకుళమాత అన్నప్రసాద భవనంలో భక్తులకు వడ్డన చేసేందుకు వస్తున్న సేవకులు.. క్యూలైన్ల వద్ద స్వయం సేవకులు

సేవకు కావాల్సిన అర్హతలు

- హిందువులై ఉండాలి.
- 18 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలి.
- సేవకులు ఆరోగ్యంగా ఉండాలి. అంటే శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలి.
- ఇది స్వచ్ఛంద సేవ కావున ఏ విధమైన చెల్లింపులు ఉండవు.
- వీరు క్రిమినల్ కార్యకలాపాల్లోను, కేసుల్లో ఉండకూడదు.
- దేవదాయ చట్టంలోని సెక్షన్ 114 ప్రకారం నిషేధిత గ్రంథాలు, కరపత్రాలను తీసుకెళ్లడం, లేదా వినియోగించడం చేయరాదు.

సేవకులకు ప్రత్యేక సూచనలు

- తమ ఐడీ ప్రూఫ్‌లను తీసుకుని రావాలి.
- సేవకులకు అధికారులు కేటాయించిన ప్రాంతంలో తమ నిస్వార్థ సేవలు అందించాలి.
- సేవకు యూనిఫాం తప్పనిసరి..విధి నిర్వహణలో మాత్రమే ఈ డ్రస్ ధరించాలి.
- గోవింద జపం చేస్తూ .. ప్రతి ఒక్కరిని గోవిందా.. అని సంబోధించాలి. తిరునామం ధరించాలి.
- స్వయం సేవకులు ప్రతి భక్తునిలో భగవంతుడి సన్నిధిని అనుభవించి భక్తితో తోటి భక్తులకు సేవ చేయాలి

సేవలకు ప్రవర్తనా నియమావళి

- శ్రీవారి సేవకులు తమ సేవలో లేదా దానికి సంబంధించి నిజాయితీ, సమగ్రత, గోప్యత, నిష్పాక్షికత, మంచి ప్రవర్తన కలిగి ఉండాలి. ఆలయ సూచనలకు లోబడి ఉండాలి.
- భక్తులను వేధించడం, వారితో వాదించడం, గొడవకు దిగడం చేయకూడదు.
- సేవలో ఉన్న సమయంలో మద్యం, చట్ట విరుద్ధ మాదకద్రవ్యాలు, పొగాకు, మాంసాహారం తీసుకోవడం, తీసుకుని వెళ్లడం నిషిద్ధం.
- శ్రీవారి సేవకులు హిందూ మతం మినహా ఇతర మతప్రచారం నిషిద్ధం.

దూరం.. మాకు భారం కాదు..



శ్రీవారి సేవ కోసం మేము ఎంతోదూరం నుంచి వచ్చినా అది మాకు భారంగా అనిపించదు. ఆ దేవదేవునికి సేవ చేయడం కోసం పరితపిస్తున్నాను. అందుకే స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు సేవచేస్తూ సాక్షాత్తు ఆ చినవెంకన్నకు సేవ చేస్తున్నట్టు అనుకుంటాను. ఐదేళ్లగా ఇక్కడకు సేవ చేసేందుకు వస్తున్నాను.

-శివనాగలక్ష్మి, గన్నవరం, వైరా మండలం, ఖమ్మం జిల్లా, తెలంగాణ

16 ఏళ్లుగా సేవలో..



చినవెంకన్న ఆలయానికి వచ్చే భక్తులకు సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉంది. స్వామి ఎదురుగా ఉండి క్యూలైన్లు జరుపుతూ ఆయనను అంతసేపు చూసే అదృష్టం ఎవరికి దక్కుతుంది. ఒక్కోసారి అన్నప్రసాద వడ్డన చేస్తుంటాను. పదహారేళ్లగా వస్తున్నాను. మానవ సేవే మాధవ సేవగా భావించి సేవలందిస్తున్నాను.

- ఇసుకపల్లి అన్నపూర్ణాదేవి, రాజమండ్రి తూ.గో. జిల్లా.

ఎన్నో పుణ్యక్షేత్రాల్లో సేవ..



చిన తిరుపతి వెంకన్నతో పాటు ఇంద్రకీలాద్రి దుర్గమ్మ, శ్రీశైలం మల్లన్న, వాడపల్లి వెంకన్న ఆలయాలకు గత కొన్నేళ్లుగా వెళ్తూ భక్తులకు సేవలను చేస్తున్నాను. ఈ సేవాభాగ్యం పరమానందాన్నిస్తోంది. ఈ అధ్యాత్మిక జీవితం ఎంతో ఉత్తేజభరితంగా ఉంది. భగవంతుని ఇష్టానికే ఇలా పని చేస్తున్నాం అనిపిస్తుంది. ఎంతోమందికి దక్కని అదృష్టం నాకు దక్కుతోంది.

- సుంకర వెంకటరమణ, ఏలూరు.

టీచర్ల పదోన్నతులకు సర్టిఫికెట్ల పరిశీలన

ఏలూరు అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లాలోని ఏ లూరు నగరపాలక సంస్థ, మరో ఏడు పుర పా లక సంఘాల పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ కేడర్ పదోన్నతులకు అర్హులైన ఉపాధ్యాయులను గుర్తించేందుకు సోమవారం సంబంధిత ఎస్టీటీల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ డీఈవో కార్యాలయంలో జరిగింది. లాంగ్వేజి పండిట్ పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్‌చేస్తూ 2019లో అప్పటి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఉమ్మడి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు 32 మందికి, హిందీ 37 మందికి పదోన్నతులు ఇచ్చారు. దీని పై సీనియార్టీని పాటించకుండా పదోన్నతులు ఇవ్వడాన్ని సవాల్‌చేస్తూ కొందరు ఎస్టీటీలు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, సీనియార్టీ ప్రకారమే ప్రమోషన్లు ఇవ్వాలని కోర్టు తీర్పుచెప్పింది. ఈ నేపథ్యంలో గతంలో పదోన్నతి పొందిన వారిలో అర్హులు, అనర్హులను గుర్తించేందుకు ఉమ్మడి జిల్లాలోని ఎస్టీటీల సీనియార్టీ జాబితా లను విడుదల చేసిన విద్యాశాఖ సంబంధిత ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను సోమవారం పరిశీలించే ప్రక్రియను చేపట్టింది. వీరిలో స్కూల్ అసిస్టెంట్ పదోన్నతికి అర్హులను గుర్తించడంతో పా టు, ఇప్పటికే పదోన్నతిపై పనిచేస్తున్న వారిలో అనర్హులకు రివర్షన్ నోటీసులు జారీచేయ నుం ది. ఆ ప్రకారం 2019నాటి ప్రమోషన్ పోస్టుల్లో అనర్హులను తొలగించి, వారిస్థానే తాజాగా సీనియార్టీ ప్రకారం అర్హులైన ఎస్టీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతికి మరికొన్ని రోజులవ్య వధి పడుతుందని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు

- వాహనదారులకు అవగాహన కల్పించాలి
- ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్


భీమవరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో జిల్లాలో ట్రాఫిక్‌పై చర్చిస్తున్న ఐజీ, ఎస్పీ

భీమవరం క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రహదారి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ జోన్లను గుర్తించి వాహన డ్రైవర్లకు, ప్రజలకు బ్లాక్ స్పాట్‌లపై అవగాహన కల్పించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం భీమవరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. భీమవరం విచ్చేసిన ఐజీ అశోక్ కుమార్‌కు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, ఇతర పోలీస్ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి జిల్లా ఎస్పీకి తగు సూచనలు చేశారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా విస్తృతంగా వాహనాలు తనిఖీలు నిర్వహించి రహదారి భద్రతా నియమాలు పాటించని వారిపై జరిమానాలు విధించాలన్నారు. అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, త్రిపుల్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి అవగాహన కల్పించాలని అధికారులకు ఐజీ సూచించారు. ట్రాఫిక్ సీఐ నారాయణ మూర్తి, ఎస్ఐ గగారిన్, ఏఎస్ఐ దాలయ్య, సత్య నారాయణ పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

ఇరగవరం: నేరాల నియంత్రణపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నదని ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఇరగవరం పోలీస్ స్టేషన్‌ను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. యువత సోషల్ మీడియాలో వ్యక్తులను కించపరిచేలా అసభ్యకరమైన పోస్టులు పెట్టకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అటువంటి వారిపై కేసులు నమోదు చేసి చట్ట పరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సైబర్ నేరాలను అరికట్టే విధంగా బ్యాంకర్లను, ప్రజలను అప్రమత్తం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై మహిళా పోలీసులు కూడా ఇంటింటికి వెళ్లి సైబర్ నేరాలు పట్ల జాగ్రత్తలు తెలిపే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు. జిల్లాలో భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, కొన్ని రైల్వే స్టేషన్ సమీప ప్రాంతాల్లో గంజాయి విస్తరిస్తుందన్నారు. గంజాయి ఎవరైతే సప్లయి చేస్తున్నారో వారిపై నిఘా పెట్టి కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. గంజాయిని అడ్డుకట్ట వేసేందుకు టోల్‌ఫ్రీ 14500 నెంబర్ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, తాడేపల్లిగూడెం డీఎస్పీ డి.విశ్వనాథ్, తణుకు సీఐ బి కృష్ణ కుమార్, ఎస్ఐలు జానా సతీష్, చంద్రశేఖర్, పి ప్రేమరాజు పాల్గొన్నారు.


సదస్సుకు హాజరైన ఆక్వా రైతులు

ఆక్వా రైతులకు నాబార్డు రుణాలు

గోదావరి జిల్లాల ఆక్వా ప్రాంతీయ సదస్సులో నాబార్డు, మత్స్యశాఖ అధికారులు

రాజమహేంద్రవరం, డిసెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): ఆక్వారంగంలో చిన్న, మధ్యతరగతి రైతులతోపాటు కార్పొరేట్ రంగానికి నాబార్డు రుణాలు ఇస్తున్నట్టు నాబార్డు సీజీఎం ఎం.ఆర్. గోపాల్ తెలిపారు. స్థానిక లాహాస్పిన్‌లో సోమవారం మత్స్యశాఖ, నాబార్డు ఆధ్వర్యంలో జరిగిన గోదావరి జిల్లాల ఆక్వా రైతుల ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. చేపలు, రొయ్యల సాగు చేస్తున్న రైతులకు నాబార్డు ఆసరాగా ఉందన్నారు. భారతదేశంలో రొయ్యల పెంపకం, ప్రాసెసింగ్, ఎగుమతి రంగాలకు సంబంధించి నాబార్డు రుణాలు ఇవ్వడానికి వ్యూహ రచన చేస్తున్నట్టు చెప్పారు. రొయ్యల సంతానోత్పత్తికి న్యూక్లియస్ బ్రీడింగ్ కేంద్రాల స్థాపనకు ఆర్థిక సహాయం అవసరం ఉందని చెప్పారు. దేశంలో 70 శాతం ఆక్వా, మత్స్య ఉత్పత్తి ఆంధ్ర ప్రదేశ్‌లో ఉందన్నారు. రాష్ట్రంలో 974 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉండడం వల్ల ఫిషరీస్ ఎగుమతుల్లో రికార్డు స్థాయి వృద్ధి నమోదైందని చెప్పారు. చిన్నమధ్య, కార్పొరేట్ సంస్థలను ఈ రంగంలో ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. ప్రతి కుటుంబం నుంచి వ్యాపారవేత్తలు తయారీ లక్ష్యంతో సీఎం చంద్రబాబు స్వర్ణాం ధ్ర 2047లో భాగంగా పనిచేస్తున్నామని తెలిపారు. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లాల్ మహ్మద్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మాదిరిగా ఆక్వా కల్చర్‌లో కూడా కౌలు రైతులకు రుణాలివ్వడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టినట్టు చెప్పారు. గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలోనే 70 శాతం ఆక్వా కల్చర్ సాగు ఉందన్నారు. 54034 మంది రైతులకు విద్యుత్ రాయితీలు అందిస్తున్నట్టు చెప్పారు. ఆక్వాలో డ్రోన్ వినియోగం మొదలెట్టామని, రొయ్యలతో పాటు పీతలకు మంచి డిమాండ్ ఉంద న్నారు. నాబార్డు సీజీఎం (హెచ్‌వో) డా. ఏ.వి.భవానీ శంకర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఉత్పత్తిరంగంలో భారతదేశంలో రెండో స్థానంలో ఉండగా, రొయ్యల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని చెప్పారు. భారత ప్రభుత్వం ఈ రంగానికి రూ.2600 కోట్లను టీఎంఎంఎస్‌వై కింద మంజూరు చేసింద న్నారు. దిగుమతి సుంకాన్ని 15 నుంచి 5 శాతానికి తగ్గించినట్టు చెప్పారు. ఎస్ఎల్‌బీసీ ఏజీఎం శ్రీనివాసదాస్యం మాట్లాడుతూ మత్స్య ఆక్వా రంగాల అభివృద్ధికి ఆయా రంగాల్లో పనిచేస్తున్న రైతులు, ఇతర యూనిట్ల సమస్యలను త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సదస్సులో ఏజీఎం ఎస్ఎల్‌బిసి శ్రీనివాస్, డా. ఏవీ.మాధురి, ఐసీఏఆర్ -సీఎంఎఫ్ఆర్ఐ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.జెకె. కిజాకుడన్, ఎంపీఈడీఏ జాయింట్ డైరెక్టర్ విజయకుమార్ ఎరగల్ తదితరులు పాల్గొన్నారు.



రాయకుదురు విద్యార్థులకు బహుమతులు

వీరవాసరం (భీమవరంటౌన్), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల భీమవరంలో నిర్వహించిన జిల్లాస్థాయి బాలోత్సవంలో వీరవాసరం మండలంలోని రాయకుదురు స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. సోమవారం ప్రతిభ చూపిన విద్యార్థుల వివరాలను హెచ్ఎం కానుకొలను శ్రీనివాసరావు తెలిపారు. క్విజ్‌లో ప్రథమ బహుమతి జే బెంజిమెన్, స్పెల్లింగ్ భాగంలో పి.తేజశ్రీ ద్వితీయ బహుమతిని జానపద నృత్యంలో కౌరు గాయత్రి, తోట రితిక, దుర్గా శరణ్య, కె.మోహన్, హర్షిత, బి.లిఖిత బహుమతి గెలుచుకున్నారు. ఫ్యాన్సీ డ్రెస్ విభాగంలో వై.తూషాంజలి ద్వితీయ బహుమతి సాధించారు. అలాగే పలు విభాగాల్లో విజేతలుగా నిలిచారు. ఉపాధ్యాయులు ఆర్‌కేడీబీ కుమారి, కె.సూర్యవాణి, వీరవల్లి ప్రసాద్ అభినందించారు.

తహసీల్దార్‌పై సబ్ కలెక్టర్ విచారణ

చాగ్రాయి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): చాగ్రాయి తహసీల్దార్ ప్రశాంతి అవకతవకలకు పాల్పడుతున్నారని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కల్లేపల్లి ప్రభాకరరావు ఇచ్చిన ఫిర్యాదుపై సోమవారం సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ చాగ్రాయి తహసీల్దార్ కార్యాలయంలో విచారణ జరిపారు. కొంత మందికి అక్రమంగా పాస్ పుస్తకాలు జారీ చేశారని, అర్హత లేకపోయినా సరైన ధ్రువపత్రాలు లేకపోయిన మరి కొందరికి ఆన్‌లైన్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు పేర్కొన్న వ్యక్తుల నుండి సబ్ కలెక్టర్ వివరాలు అడిగితెలుసుకొని రికార్డులు పరిశీలించారు.


నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులు... నదిపై పడవలో రైతు అవస్థలు

కొత్తపాలెం-కె.బేతపూడి

బ్రిడ్జి నిర్మాణం కలేనా..

ఆరేళ్ల క్రితం శంకుస్థాపన

మధ్యలో నిలిచిపోయిన నిర్మాణం

మొగల్తూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెం-భీమవరం మండలం కె.బేతపూడి గ్రామాలను కలుపుతూ గొంతేరు డ్రెయిన్‌పై నిర్మిస్తున్న బ్రిడ్జి ఆరు సంవత్సరాలు గడిచినా నిర్మాణం పూర్తి కాలేదు. ఇరు గ్రామాల రైతులు, ప్రజలు, తీర గ్రామాల నుంచి జిల్లా కేంద్రం భీమవరం చేరుకునే ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడే ఈవంతెన నిర్మాణం ఆవశ్యకతను గుర్తించి నాటి ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు ఏషియన్ బ్యాంకు సహకారంతో దాదాపుగా రూ.16.50 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఈ వంతెన నిర్మాణానికి నాటి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి నారా లోకేశ్ 2018, డిసెంబర్ నెలలో కొత్తపాలెం వచ్చి శంకుస్థాపన చేశారు. ఈ కాంట్రాక్ట్‌ను దక్కించుకున్న నిర్మాణ సంస్థ గొంతేరు డ్రెయిన్‌లో బ్రిడ్జి నిర్మాణానికి పిల్లర్లు నిర్మాణం కొంత వరకు చేపట్టి నిర్మాణం వదిలివేశారు. ఈశంకుస్థాపన అయిన కొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు రావడం అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ప్రభుత్వంలో ఈవంతెన నిర్మాణాన్ని పట్టించుకోకపోవడం, అధికారులు చూసి చూడనట్టు వదిలివేయడంతో నిర్మాణం ముందుకు సాగలేదు. గడిచిన సార్వత్రిక ఎన్నికల ముందు బండారు మాధవ నాయుడు ఈవంతెన పూర్తి చేయాలంటూ ఆందోళనలు చేశారు. అయినా గత ప్రభుత్వం ఈవంతెన నిర్మాణం పట్టించుకోలేదు. దీంతో రైతులు, గ్రామస్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయిన్ దాటడానికి పడవలను ఉపయోగిస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో బేతపూడి గ్రామస్థులు వెంప, మొగల్తూరు మీదగా భీమవరం వెళ్తున్నారు. దీనితో పది కిలోమీటర్ల దూరం పెరుగుతున్నది.

కూటమి ప్రభుత్వంలో పూర్తవుతుందా..

బ్రిడ్జి నిర్మాణం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున పూర్తి అవుతుందనే ఆశలు రైతుల్లో చిగురించాయి. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ల దృష్టికి తీసుకువెళ్ళాలని తీర గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

పారదర్శకంగా కానిస్టేబుళ్ల పరీక్షలు: ఎస్పీ

తొలి రోజున 309 మంది హాజరు


అభ్యర్థుల ఎత్తు కొలుస్తున్న పోలీసు అధికారులు

ఏలూరు క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్ పోస్టుల భర్తీకోసం ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంట్‌బోర్డు జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఇప్పటికే ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత అయిన అభ్యర్థులకు సోమవారం నుంచి ఫిజికల్ మెజర్‌మెంట్‌పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలు నిర్వహించడం ప్రారంభించామని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద సోమవారం ఉదయం మీడియాతో ఎస్పీ మాట్లాడారు. సోమవారం 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 309 మంది హాజరయ్యారు. వీరిలో 179 మంది అన్ని ఈవెంట్స్‌లో అర్హత సాధించారని చెప్పారు. మహిళా అభ్యర్థినులకు జనవరి 3,4 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించే ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని ప్రతి అంశాన్ని డ్రోన్ కెమెరా ద్వారా చిత్రీకరణ జరుపుతున్నామన్నారు. ఎటు వంటి అపోహ లకు తావులేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వైద్య పరమైన ఇబ్బందులు ఎదురైతే వెంటనే అస్వస్థతకు గురైన అభ్యర్థులను వెంటనే ఆసుపత్రికి తరలించడానికి రెండు అంబులెన్సులను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులకు 1600 మీటర్ల పరుగుపందెం నిర్వహిస్తామని దానిలో డిస్క్వాలిఫై అయితే మిగిలిన ఈవెంట్స్‌కు అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. జనవరి 9వ తేదీ వరకూ ఈవెంట్స్ కొనసాగుతాయని అభ్యర్థులు మినహా ఎట్టిపరిస్థితుల్లో ఎవరిని అనుమతించమని, ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు కూడా అభ్యర్థులు తీసుకురాకూడదని ఎస్పీ తెలిపారు.

జాతీయస్థాయి వాలీబాల్‌కు రిఫరీగా రామకృష్ణ



బుట్టాయగూడెం, డిసెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్‌లో ప్రముఖ ఆధ్యాత్మిక సేవా సంస్థ ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 30 వరకు జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు ఆదివాసీ తెగకు చెందిన ఇరప రామకృష్ణ ప్రత్యేక రిఫరీగా వ్యవహరించారు. ఈయన బుట్టాయగూడెం మండలం ముద్దప్ప గూడెంకు చెందిన ఆదివాసీ. ప్రస్తుతం రామకృష్ణ జంగారెడ్డిగూడెం వెంకటేశ్వర జూనియర్ కాలేజీలో పీఈటీగా పనిచేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

రు.16,400లు నగదు స్వాధీనం

ఉండి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. పోలీసులు అందించిన వివరాలు ఇవే. ఉండి మండలం కోలమూరులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు వెళ్లివారిని పట్టుకున్నారు. ఈదాడిలో 16,400 నగదు స్వాధీనం చేసుకుని నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

జూడోలో గురుకుల విద్యార్థినులకు పతకాలు


సాధించిన పతకాలతో గురుకుల విద్యార్థినులు

పెదపాడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జూడో పోటీల్లో గురుకుల విద్యార్థినులు పతకాలతో మెరిశారు. ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పెదపాడు మండలం వట్లూరులోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల బాలికల విద్యాలయం విద్యార్థినులు వెండిపతకంతో సహా ఏడు పతకాలను సాధించారు. ఈ సందర్భంగా గురుకుల విద్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పతకాలు సాధించిన విద్యార్థినులను విద్యాలయం ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం స్థాయిలో జరిగిన జూడో టోర్నమెంట్‌లో 70కిలోల విభాగంలో గురుకుల టి.దివ్యతేజ రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచి, వెండి పతకం సాధించిందని చెప్పారు. అలాగే రామలక్ష్మి, రంజనిలు తృతీయస్థానంతో పతకాలను సాధించారని తెలిపారు. జూనియర్స్ విభాగంలో మనోహరిణి, ప్రవల్లిక, సబ్ జూనియర్స్ విభాగంలో కె.దయ, లక్ష్మీకావ్య రాష్ట్రస్థాయిలో మూడోస్థానంలో నిలిచారని ఆమె చెప్పారు.

క్రైమ్ కార్నర్

గుర్తు తెలియని మృతదేహం

ఏలూరు క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దెందులూరు రైల్వే స్టేషన్ సమీపంలో సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం రైలు పట్టాలపై తునాతునకలై ఉన్నాడు. మృతుడు నీలం రంగు పొట్టి చేతుల గళ్ళ చొక్కా, నీలం రంగు జీన్స్ షార్ట్ కలిగి ఉన్నాడు. మృతుడు రైలు నుంచి జారిపడ్డాడా లేదా రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగిందా? ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేదా మరే ఇతర కారణంతో మరణం జరిగిందా అనే విషయాలు తెలియాల్సి ఉంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం మృతుడు తూర్పుగోదావరి జిల్లా రావుల పాలెం సమీపంలోని ఈతకోట గ్రామానికి చెందిన వాడుగా సమాచారం అందింది. మృతుని ఎడమ చేతిమీద భాగ్యలక్ష్మి అనే పచ్చబొట్టు ఉంది. మృతదేహానికి పోస్టు మార్టం నిమిత్తం ఏలూరు మార్చురీకి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే ఎస్ఐ పి సైమన్ 99892 19559కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

పేకాటలో ఏడుగురి అరెస్టు

40,600 రూపాయల సీజ్

ఏలూరు క్రైం, డిసెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): ఏలూరు వన్‌టౌన్‌లోని దక్షిణపువీధిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు వన్‌టౌన్ ఎస్ఐ మదీనాబాషా సోమవారం రాత్రి తన సిబ్బందితో దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 40,600 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో ఒకరు డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో డ్రైవర్ ఒకరు కాగా, మరొకరు కలెక్టరేట్‌లో క్లాస్ 4 ఉద్యోగి ఉన్నట్లు గుర్తించారు.

పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం

దెందులూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పూడ్చిన మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. అలుగులగూడెం గ్రామానికి చెందిన మద్దా ఏసు (40) ఈనెల 4వ తేదీన తన ఇంట్లో ఫ్యాన్‌కు లుంగీతో ఉరివేసుకుని మృతి చెందాడు. పాఠశాల నుంచి ఇంటికి తిరిగి వచ్చిన పిల్లలు తమ తండ్రి ఇంటిలో ఉరి వేసుకుని ఉన్నాడని గ్రామస్థులకు తెలిపారు. ఆ తర్వాత మృతదేహాన్ని ఖననం చేశారు. అయితే ఊరు వెళ్లి వచ్చిన మృతుడి తమ్ముడు సలోమాన్ తన సోదరుడిది ఆత్మహత్య కాదని హత్య అని అనుమానాలు ఉన్నాయని దెందులూరు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. దీంతో దెందులూరు పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి సోమవారం తహసీల్దార్ సుమతి, ఎస్ఐ శివాజీ ఆధ్వర్యంలో శ్మశాన వాటికలో పెట్టెను బయటకు తీసి పోస్టుమార్టం చేసే కార్యక్రమం నిర్వహించారు.

రేవ్ పార్టీలో ఎరువుల డీలర్లు

బూరుగుపూడి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు .. 13 మంది యువకులు, ఐదుగురు యువతుల అరెస్టు


నిందితులను అరెస్టు చేసి వివరాలు చెబుతున్న కోరుకొండ సీఐ సత్యకిషోర్

జగ్గంపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న రేవ్ పార్టీపై పోలీసులు దాడి చేసి 18 మందిని అదుపులోనికి తీసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజక వర్గం కోరుకొండ పోలీస్‌స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యకిషోర్ సోమవారం వివరాలను వెల్లడించారు. ఈ నెల 27న గుజరాత్ మైక్రో న్యూట్రిషియన్ కంపెనీకి చెందిన సేల్స్ ఎగ్జిక్యూటివ్ గోపాలకృష్ణ రూ. 18 వేలకు కోరుకొండ మండలం బూరుగుపూడి జంక్షన్ వద్ద ఉన్న ఏబీఆర్ ఇన్‌ఫ్రా నాగసాయిరాం ఫంక్షన్ హాల్ బుక్ చేసి ఆదివారం అర్ధరాత్రి రేవ్ పార్టీ ఏర్పాటు చేశారు. ఇక్కడికి పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు, తణుకు, ఆచంట తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం, ధవళేశ్వరం ప్రాంతాలకు చెందిన 10 మంది ఎరువుల డీలర్లను రప్పించారు. గోపాలకృష్ణకు పరిచయం ఉన్న కాకినాడకు చెందిన అను అనే మహిళ ద్వారా ముగ్గురు యువతులను రంపచోడవరం, ధవళేశ్వరం ప్రాంతాల నుంచి ఇద్దరు మొత్తం ఐదుగురు యువతులను ఆదివారం రాత్రి ఫంక్షన్ హాల్‌కు రప్పించారు. ఆ ఫంక్షన్ హాలులో రూ.15 వేలకు 5 రూమ్‌లు బుక్ చేశారు. వీరందరూ మద్యం సేవిస్తూ అమ్మాయిలతో డ్యాన్స్‌లు చేస్తూ ఎంజాయ్ చేస్తున్న సమయంలో తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్‌కి వచ్చిన సమాచారం మేరకు స్పెషల్ పోలీస్, లోకల్ పోలీసులు ఫంక్షన్ హాల్‌పై రైడ్ చేశారు. అక్కడ ఉన్న 13 మంది యువకులు, ఐదుగురు యువతులను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. యువతులను వైద్య పరీక్షల నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. ఫంక్షన్ హాల్ యజమాని సత్తి భామిరెడ్డి పరారీలో ఉండడంతో కుమారుడు రామిరెడ్డి, వివిధ ప్రాంతాల నుంచి యువతులను తీసుకొచ్చిన ట్యాక్సీ డ్రైవర్, సూత్రధారుడైన గోపాలకృష్ణ, 10 మంది ఎరువుల డీలర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసుకున్న సౌండ్ సిస్టమ్, రూ.61 వేల నగదు, గోపాలకృష్ణ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై కేసు లోతుగా విచారణ జరుగుతుందన్నారు. సమావేశంలో కోరుకొండ ఇన్‌చార్జ్ ఎస్ఐ ఎండీ అశ్వాక్, ఇతరపోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

19 మందికి గాయాలు


మద్దాల కుమారి, పూజిత

ముసునూరు, డిసెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): ముసునూరులో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. సోమవారం ఎస్సీ బీసీ కాలనీల్లో పిల్లలు, వృద్ధులు, మహిళలపై విచక్షణ రహితంగా పిచ్చికుక్క దాడి చేయడంతో 19మంది తీవ్ర గాయాల పాలయ్యారు. ఎస్సీకాలనీకి చెందిన ఆశావర్కర్ మద్దాల కుమారిపై పిచ్చికుక్క దాడి చేయడంతో ఆమె కుడికన్నుకు తీవ్ర గాయం కావడంతో 108 వాహనంపై విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరికొందరిపై కూడా పిచ్చి కుక్క దాడి చేయండంతో బాధితులకు ముసునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి షకీనా ఇవాంజలి, వైద్యసిబ్బంది చికిత్స అందించారు. స్థానికులు పిచ్చికుక్కను హతమార్చారు.

రేషన్ షాపులో డీటీ ఆకస్మిక తనిఖీ


శంభునిపేట రేషన్ షాపులో తనిఖీ చేస్తున్న డీటీ నరేష్

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పీడీఎఫ్ బియ్యంలో వ్యత్యాసం కనపడినట్టు తహసీల్దార్ యడ్ల దుర్గాకిషోర్ తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా సోమవారం సీఎస్‌డీటీ జి.నరేష్ కుమార్, సిబ్బందితో పట్టణంలోని శంభుని పేటలోని గెడ్డం సునీత (షాపునెంబరు 0585073) షాపును తనిఖీ చేయగా రేషన్ బియ్యంలో రికార్డుల కన్నా 14 క్వింటాళ్ల తరుగు ఉన్నట్టు గుర్తించామని తహసీల్దార్ తెలిపారు. దీనిపై శాఖాపరమైన క్రమశిక్షణ చర్యల్లో భాగంగా డీలర్ సునీత పై నివేదికను జిల్లా జాయింట్ కలెక్టర్‌కు నివేదిక పంపడం జరిగిందని వెల్లడించారు.

పది మంది పాత నేరస్తులకు బైండోవర్

ముసునూరు, డిసెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన పాత ముద్దాయిలను ముసునూరు తహసీల్దార్ పురుషోత్తమ శర్మ ఎదుట ఎక్సైజ్ పోలీసులు సోమవారం బైండోవర్ చేశారు. ముసునూరుకు చెందిన పంజుగల వెంకట నరసమ్మ, వీరంకి రజిని, చెక్కపల్లికి చెందిన కంపసాటి శ్రీనివాసరావు, కాట్రేనిపాడుకు చెందిన గండికోట రాటాలు, గుత్తి శ్రీరావమ్మా, గుత్తి వెంకటేశ్వరరావు, సొంగ ధన లక్ష్మీ, సొంగ సరోజినీ, బొట్ల రవి, సొంగ మహేష్‌లను తహసీల్దార్ కోర్టులో హాజరు పర్చారు.



32 ఎకరాల్లో గడ్డి వాము దగ్ధం

రూ.6 లక్షలకు పైగానే ఆస్తి నష్టం

ఆచంట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆచంట మండలం కరుగోరుమిల్లి ప్రబల తీర్థం పుంతలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో 32 ఎకరాల గడ్డి వాము అగ్నికి దగ్ధమైంది. గ్రామానికి చెందిన దొమ్మేటి సత్యనారాయణ, చింతపల్లి నాగరాజు, కొప్పిశెట్టి వర ప్రసాద్, బొర్రా సూర్యనారాయణ, దొమ్మేటి వీరాస్వామి రైతులకు సంబంధించి పశువుల కోసం నిల్వ చేసిన గడ్డి వాములను గుర్తు తెలియని వ్యక్తులు అంటించిన కారణంగానే తమ గడ్డి వాములు దగ్ధమైనట్లు రైతులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక అధికారులు ఫైర్ ఇంజన్‌లతో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. ఆరు లక్షలకు పైగానే ఆస్తి నష్టం సంభవించినట్లు రైతులు చెబుతున్నారు. ఈ ప్రమాదం పై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

పట్టాలు ఇప్పిస్తామని ఐదేళ్లు తిప్పించుకున్నారు

మాజీ ఎమ్మెల్యే కొఠారు ఇంటి వద్ద కొల్లేరు లంక గ్రామస్తుల నిరసన



కొఠారు ఇంటి వద్ద నినాదాలు చేస్తున్న కొల్లేరులంక గ్రామస్తులు

పెదవేగి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అరుగాలం శ్రమించి, తవ్వుకున్న చెరువులకు కౌలు చెల్లిస్తామని కాజేసి, ఆ చెరువులకు పట్టాలు ఇస్తామని నమ్మబలికి మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఐదేళ్లు ఇంటి చుట్టూ తిప్పుకున్నారని కోమటిలంక, శ్రీపర్రు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చేపల చెరువుల లీజు సొమ్ముకు సంబంధించి అబ్బయ్యచౌదరి ఐదేళ్ల కౌలు సొమ్ము రూ.ఐదున్నర కోట్లు ఇవ్వాలని చేపట్టిన ఆందోళన సోమవారం 19వరోజుకు చేరుకుంది. ఆయన మాటలకు పొంగిపోయిన తాము తవ్వుకున్న చెరువులకు అధికారికంగా పట్టాలు వస్తాయని ఆశపడ్డామన్నారు. ఎప్పుడు వెళ్లినా బాబు లండన్‌లో ఉన్నారు. వచ్చిన తరువాత చూద్దామని అబ్బయ్యచౌదరి తండ్రి రామచంద్రరావు చెబుతూ వచ్చారన్నారు. ఐదేళ్లుగా పట్టాలు వస్తాయని కౌలు సొమ్ము కోసం నిలదీయలేకపోయామన్నారు. ఒక దశలో కౌలు సొమ్ము అడిగిన కొంత మందిని అక్రమంగా జైలుకు పంపారని వాపోయారు. తమ సొమ్ము ఇచ్చే వరకు కదిలేది లేదని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో నేతల రవి, సైదు సత్యనారాయణ, ఘంటసాల శ్రీహరి, హరికృష్ణ ముంగర హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు : చింతమనేని



గ్రామస్తుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో లంక గ్రామస్తుల సమస్యలను పాలకులు గాలికొదిలేశారని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఏలూరు రూరల్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రభాకర్‌ను సోమవారం కలిసి తాగునీటి సమస్యలను వివరించారు. లంక గ్రామాల ప్రజలు సురక్షితమైన తాగునీరు అందక రోగాలబారిన పడి, ఆర్థికంగా, మానసికంగా కుంగిపోయారన్నారు. గోదావరి జలాలను లంక గ్రామాలకు తరలించి, రక్షిత తాగునీరు అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేశామని ఆయన వివరించారు. గత ఐదేళ్లలో ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోకుండా దాడులు, దౌర్జన్యాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిందన్నారు. నంబూరి నాగరాజు, తాతా సత్యనారాయణ, మంచినేని శ్రీనివాసరావు, మేకా కనకరాజు, గుత్తా అనిల్, పైడిపాటి శేఖర్, కొనకళ్ల శివమణి, పామర్తి భూషణం తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి స్వచ్ఛంద సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే రోషన్



వెబ్‌సైట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్

చింతలపూడి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో సంస్థ చేపట్టిన సేవా కార్యక్రమాల వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15 ఏళ్లుగా విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమాలు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. మరిన్ని సేవలు అందించేవిధంగా సంస్థ ప్రణాళిక రూపొందించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎస్.కె.మొహిద్దీన్‌పాషా, శ్రీనివాసరావు, గుంషావలీ, రాజశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరించిన కలెక్టర్, జేసీ, సంఘ నాయకులు

ఏలూరు అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ముద్రించిన నూతన సంవత్సర డైరీని కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, క్యాలెండర్‌ను డీఈవో వెంకటలక్ష్మమ్మ సోమవారం వేర్వేరు కార్యక్రమాల్లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠ్యాంశాలతోపాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కలిగించాలని సూచించారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. జేసీ మాట్లాడుతూ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడానికి టీచర్లు కృషిచేయాలన్నారు. పోటీ పరీక్షలకు హైస్కూలు స్థాయి నుంచే విద్యార్థులకు తర్ఫీదునివ్వాలని కోరారు. డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ షరీఫ్, సంఘ రాష్ట్ర కార్యదర్శి బి.ఏ.సాల్మన్‌రాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డి దొర, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సక్షమ్ క్యాలెండర్



సక్షమ్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఏలూరు రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు వారి కుటుంబానికి భారం కాకూడదని, వారి చదువుకు, జీవనోపాధికి దేశవ్యాప్తంగా విశేషంగా కృషిచేస్తున్న సమదృష్టి, క్షమతా వికాస్ అనుసంధాన్ మండలి (సక్షమ్) సేవలు అభినందనీయమని బీజేపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. శనివారపు పేట, శ్రీరామ్‌నగర్‌లోని గారపాటి చౌదరి కార్యాలయంలో సక్షమ్ క్యాలెండర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఐ.అశోక్‌చక్రవర్తివర్మ, సక్షమ్ జిల్లా ఫీల్డ్ కోఆర్డినేటర్ కె.రమేష్, సేవికా సమితి కార్యదర్శి నీరజ, సౌజన్య పి.రామ చంద్రరాజు, ఎ.రాజు, జి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక ఇరిగేషన్ డివిజన్ కార్యాలయంలో ఏపీ విజువల్లీ ఛాలెంజెడ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ఆవిష్కరించారు. దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నా మొక్కవోని ధైర్యంతో చదువుకుని ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడి సమాజానికి సేవ చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరుజిల్లా అధ్యక్షుడు గోపిశెట్టి వీరభద్రరావు, కార్యదర్శి కె.మదన్ తదితరులు పాల్గొన్నారు.

భోజన కార్మికుల వేతన బకాయి చెల్లించాలి

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా, కార్మికులకు వేతనాలు పెంచకుండా వెట్టి చాకిరి చేయిస్తున్నదని ఏపీ మధ్యాహ్నభోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ నాయకురాలు అనురాధ అన్నారు. స్థానిక సీఐటీయు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఐదు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణవ చెల్లించాలని, గ్యాస్ ప్రభుత్వమే ఇవ్వాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, నెలలో ఐదో తేదీలోపు వేతనాలు బిల్లులు అకౌంట్లలో వేయాలని కోరారు. ఆర్.లింగరాజు, విజయలక్ష్మి, అనంతలక్ష్మి, మహాలక్ష్మి, దుర్గ పాల్గొన్నారు.

మైసన్నగూడెంలో పంచాయతీ స్థలం ఆక్రమణ

మంత్రి, జేసీ ఆదేశాలు అమలు చేయని అధికారులు!

ఏలూరు రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంలో వైసీపీ కార్యకర్త పంచాయతీ స్థలాన్ని ఆక్రమించాడు. మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లడంతో చర్యలు జాయింట్ కలెక్టర్‌కు సూచించారు. జేసీ ధాత్రిరెడ్డి విచారించి అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని ఆదేశించారు. అధికారులు మీనమేషాలు లెక్కిస్తూ మంత్రి లోకేశ్, జేసీ ఆదేశాలను బేఖాతరు చేయడంపై వార్డు సభ్యుడు రమేష్ సోమవారం జేసీ ధాత్రిరెడ్డిని కలిసి మరోసారి ఫిర్యాదు చేశారు. జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంలో వైసీపీకి చెందిన వ్యక్తి పంచాయతీకి స్థలం 4 సెంట్లు ఆక్రమించాడని గతంలోనే అక్కడి అధికారులకు ఫిర్యాదు చేశాడు. పట్టించుకోకపోవడంతో ఇటీవల మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశాడు. స్పందించిన మంత్రి లోకేశ్ జేసీ ధాత్రిరెడ్డికి సమస్యను పరిష్కరించాలని సూచించారు. స్థలం ఆక్రమణ గుర్తించి తొలగించాలంటూ జేసీ ఆదేశాలు ఇచ్చారని వార్డు సభ్యుడు రమేష్ తెలిపారు. పంచాయతీ స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా నుయ్యి, బోరింగ్ పంపు సైతం స్వాధీనం చేసుకున్నాడని, ఆ ప్రాంగణంలోనే కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికారులు స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంలో తత్సారం చేస్తున్నారని వార్డు సభ్యుడు ఆరోపించారు. మంత్రిలోకేశ్, జాయింట్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి ఆదేశాలను సైతం అధికారులు పట్టించుకోవడం లేదంటూ తక్షణం పంచాయతీ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని రమేష్ విజ్ఞప్తి చేశాడు.







పెదవేగిలో విద్యార్థులు ప్రదర్శిస్తున్న సైన్స్ ఫెయిర్ అంశాలు, ఆకట్టుకున్న ప్లాస్టిక్ రహిత సమాజం ప్రదర్శన, ఉంగుటూరు వైజ్ఞానిక ప్రదర్శన పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి

బాల శాస్త్రవేత్తలు

మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఆకట్టుకున్న అంశాలు

పెదవేగి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలం స్థాయిలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో బాల శాస్త్రవేత్తల సైన్స్ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. పాఠశాల స్థాయిలో నిర్వహించే సైన్స్ ఫెయిర్ వంటి అంశాలు విద్యార్థులు భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా ఎదగడానికి దోహదపడుతుందని పెదవేగి ఎంఈవో -2 వి.అరుణకుమార్ అన్నారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం మండలస్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. మండలంలోని 13 ప్రాథమికోన్నత, 7 ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు వివిధ అంశాలను ప్రదర్శించారు. మొత్తం 7అంశాలు, మూడు కేటగిరిల్లో ప్రదర్శనకు ఉంచామని ఆయన చెప్పారు. వ్యక్తిగత అంశాలతోపాటు గ్రూపు అంశం, టీచర్స్ అంశం కూడా ఇందులో ఉన్నాయని, ఈ మూడు అంశాల్లో ఉత్తమ ప్రదర్శన ఎంపిక చేసి, మూడు కేటగిరిల్లో జిల్లాస్థాయిలో జరిగే సైన్స్ ఫెయిర్ ప్రదర్శనకు పంపిస్తామని అరుణ్‌కుమార్ తెలిపారు. ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచుతాయన్నారు. కార్యక్రమంలో పెదవేగి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లీశ్వరి, ఆయా పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, కుమార్, శ్యామల, సీఆర్పీ రవి పాల్గొన్నారు.

● ఉంగుటూరు: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. మండల స్థాయిలో వ్యక్తిగత ప్రదర్శనలో రాచూరు హైస్కూలుకు చెందిన ఏ.రాజేష్ (ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్) ప్రథమ, లెక్కలలో త్రిడి షేప్స్ (వర్కింగ్ మోడల్)లో కైకరం హైస్కూలుకు చెందిన వి.చాందినీప్రియ, వి.శ్రీవల్లి, టీచర్ విభాగంలో ఫిజిక్స్‌లో పారలల్, సిరీస్ కనెక్టింగ్ వర్కింగ్ మోడల్‌లో విజయం సాధించినట్లు ఎంఈవో రవీంద్ర భారతి తెలిపారు. మండలంలోని పలు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి ప్రదర్శనలను తిలకించారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



పెదవేగిలో వినతులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

పెదవేగి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయని మండల ఆర్ఐ కేవీ.సారధి అన్నారు. కొండలరావుపాలెంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వినతులు అందించారు. ఆర్ఐ సారధి మాట్లాడుతూ రెవెన్యూ సంబంధ సమస్యలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సర్వేయర్ సత్యనారాయణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: రెవెన్యూ సమస్యలన్నీ పరిష్కరిస్తామని తహసీల్దార్ గెడ్డం ఎలీషా అన్నారు. పోలాసిగూడెం గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజలు, రైతుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. గ్రామ కార్యదర్శి బ్రహ్మయ్య, వీఆర్వో పి.లక్ష్మీదేవి, ఆర్ఐ పి.రామకృష్ణలతోపాటు సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

● చింతలపూడి: రైతుల భూ సమస్యలు, రెవెన్యూ సంబంధిత సమస్యలు పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయని తహ సీల్దార్ ప్రమద్వర అన్నారు. సీతానగరం రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. సర్పంచ్ గాయం మల్లేశ్వరి, ఎంపీటీసీ కె.రాంబాబు, కూటమి నాయకులు కక్కిరాల నాగేశ్వరరావు, ముత్తా రాజశేఖర్, బి.శివ పాల్గొన్నారు.

● ఏలూరు: పోలవరం మండలంల గూటాల గ్రామ సచివాలయంలో తహసీల్దారు సాయిరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గూటాల పరిధిలో భూసమస్యలకు సంబంధించి ఫిర్యాదులు వినతులు స్వీకరించారు. ఆటపాకల వెంకటేశ్వరరావు, ఎస్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో రావలసిన 9 ఎకరాల వ్యవసాయ భూమిని ఇప్పించాలని కోరుతూ నిమ్మలగూడెం రెవెన్యూ సదస్సులో రామన్నగూడెం ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఉంటున్న కొల్లూరు, కొండేపూడి, తుమ్మిలేరు, పోచవరం, చోక్కనపల్లి గ్రామాల నిర్వాసితులు డిప్యూటీ తహసీల్దార్ పి.రమేష్‌కు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో భూముల సమస్యలు పరిష్కరించాలని ప్రజలు వినతులు అందజేశారు. ఆర్ అండ్ ఆర్ భూమి విషయాన్ని ఐటీడీఏ అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్ర తిరువీధుల్లో శ్రీవారు

ద్వారకాతిరుమల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఉభయదేవేరులు, గోదాదేవితో కలసి తొళక్కవాహనంపై క్షేత్ర వీధుల్లో సోమవారం ఉదయం భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి దివ్యమూర్తులకు అర్చకులు హారతులు పట్టారు. అనంతరం ధనుర్మాస మండపంలో ఉంచి పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

నియోజక అభివృద్ధే లక్ష్యం

చింతలపూడి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నియోజక అభివృద్ధి తన లక్ష్యమని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అన్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి మీట్ విత్ ఎమ్మెల్యే కార్యక్రమంలో మాట్లాడారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పన పరిశ్రమల రాకపై మాట్లాడారు. నాలుగు మండలాల అధికారులు హాజరై ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. చింతలపూడి, జంగారెడ్డిగూడెం, లింగపాలెం, కామవరపుకోట మండలాల నుండి అధికారులు హాజరయ్యారు.

టీడీపీ సీనియర్ నాయకుడు ప్రసంగిరాజు మృతి



బుట్టాయగూడెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెంకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు వెంపా ప్రసంగిరాజు (66) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఏలూరులో బంధువుల ఇంటి వద్ద సోమవారం తెల్లవారుజామున అస్వస్థతకు గురి కావడంతో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామం బుట్టాయగూడెం తరలించగా సీనియర్ నాయకులు గొడవర్తి సాగర్, కాకర్ల సురేష్, జనసేన నాయకులు కరాటం వెంకటరెడ్డినాయుడు, కరాటం ఉమామహేశ్వరావు, లూథరన్ చర్చి పాస్టర్ ఎంఎ ఆమెన్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

48 మద్యం సీసాలు స్వాధీనం

కొయ్యలగూడెం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 48 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని అంకాలగూడెం బస్‌స్టేషన్ వద్ద ఒక వ్యక్తి మద్యం బాటిల్‌తో సమాచారం వచ్చిందన్నారు. సిబ్బందితో దాడి చేసి అతడి వద్ద 48 క్వాటర్ బాటిల్స్ దొరికాయని తెలిపారు. అతని పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘర్షణకు కారణమైన ఇద్దరి అరెస్ట్

కామవరపుకోట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అంకాలంపాడు పంచాయతీ జలపవారిగూడెంలో ఘర్షణకు కారణమైన పల్లా రఘు, కరటూరి శ్రావణకుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. 307 సెక్షన్ కింద అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్టు ఎస్ఐ చంద్రరావు, ఏఎస్ఐ వీరాస్వామి తెలిపారు. సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.



రామాంజనేయ యుద్ధం నాటకంలో సన్నివేశం

అలరించిన రామాంజనేయ యుద్ధం

ఏలూరు రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రామాంజనేయ యుద్ధం నాటకం, భక్తులను ఆకట్టుకుంది. ఆర్.ఆర్‌పేటలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి శ్రీగరికపాటి ఆర్ట్స్ థియేటర్ శ్రీరామాంజనేయ యుద్ధం నాటకం నిర్వహించారు. శక్తికంటే భక్తి గొప్పదని చాటిచెప్పిన రామాంజనేయ యుద్ధం విశేషంగా ఆకట్టుకుంది. రాముడిగా వల్లముల రామాంజనేయ సిద్ధాంతి, ఆంజనేయుడిగా చౌదరి నటించారు. సంగీతం వి.సురేష్‌రాజు సహకారం అందించారు. గరికపాటి కాళిదాసు పర్యవేక్షించారు.

స్విమ్మింగ్‌లో ప్రతిభ

ఏలూరు రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ సౌత్‌జోన్ స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన బలగా స్వామినాయుడును కలెక్టర్ వెట్రిసెల్వి అభినందించారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన 35వ జాతీయ సౌత్‌జోన్‌లో జిల్లాకు చెందిన బలగ స్వామి నాయుడు 50మీటర్ల బటర్ ఫ్లై విభాగంలో రజత పతకం సాధించాడు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా క్రీడాభివృద్ధిశాఖ అధికారి బి.శ్రీనివాసరావుతో కలిసి స్వామినాయుడు, జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ వెట్రిసెల్వి, జేసి పి.ధాత్రిరెడ్డి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని, చదువులో కూడా రాణించాలని ఆకాంక్షించారు. భవాని, రవికార్తీక్, స్విమ్మింగ్‌లో ఏపీ టీమ్ వెండి పతకాన్ని కైవశం చేసుకోవడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో కోచ్ బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కామవరపుకోట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా పోలీసు నిబంధనలు ఉల్లంగించి వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తడికలపూడి ఎస్ఐ చంద్రరావు, ఏఎస్ఐ వీరాస్వామి హెచ్చరించారు. సోమవారం వారు మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి లేకుండా ఈవెంట్లను నిర్వహించకూడదన్నారు. ఈవెంట్‌లు నిర్వహించే ప్రదేశాల్లో వీడియో రికార్డింగ్, సీసీ కెమెరాలను అమర్చాలని, అశ్లీల నృత్యాలను ప్రదర్శించకూడదన్నారు. కోడిపందేలు, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలపై పోలీస్ హెల్ప్‌లైన్ 112కు ఫోన్ చేయాలన్నారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ప్రజలు గుర్తుంచుకోవాలని ఎస్ఐ చంద్రరావు, ఎఎస్ఐ వీరాస్వాములు పేర్కొన్నారు.

● జీలుగుమిల్లి : నూతన సంవత్సర వేడుకల్లో జాగ్రత్తలు పాటించాలని జీలుగుమిల్లి సీఐ బి.వెంకటేశ్వరావు అన్నారు. సర్కిల్ పరిధిలో బుట్టాయగూడెం, టి.నరసాపురం ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. యువత నూతన సంవత్సర వేడుకలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తావులేకుండా జరుపుకోవాలన్నారు. బైక్‌లు స్పీడ్‌గా నడపడం, ప్రజల్ని ఇబ్బందులు పెట్టడం, మద్యం సేవించి నడపడం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

మార్గమధ్యలో ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

ఏలూరు క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నుంచి జంగారెడ్డిగూడెం వెళుతున్న ఆర్టీసీ బస్సు ఏలూరు ఓవర్ బ్రిడ్జి సమీపంలో పెట్రోల్ బంక్ ఎదురుగా ఆగిపోయింది. జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (ఏపీ 37జడ్ 0175) సోమవారం మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో ఆగిపోయింది. అక్కడే ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ గమనించి రేడియేటర్ నుంచి నీళ్లు కారిపోతున్నాయని డ్రైవర్‌కు చెప్పారు. డ్రైవర్ వెంటనే కిందకు దిగి ఇంజన్‌ను పరిశీలించుకున్నారు. ఆర్టీసీ గ్యారేజీ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో బస్సును తీసుకువెళ్ళిపోయారు. ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

కుల గణనపై సామాజిక తనిఖీ

ఏలూరు రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణన సామాజిక తనిఖీ జరుగుతుందని సాంఘిక సంక్షేమశాఖ జేడీ జయప్రకాష్ సోమవారం తెలిపారు. వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉంచామని, అభ్యంతరాలు ఈనెల 31లోగా స్వీకరిస్తొన్నారు. జనవరి 6వరకు అభ్యంతరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి జనవరి 10న తుది వివరాలు గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించాలన్నారు. మూడు దశల్లో తనిఖీ చేపట్టనున్నట్లు తెలిపారు. పేరు, ఆధార్‌నెంబర్, పుట్టిన తేదీ, వయస్సు, ఉపకులం, మరుగుదొడ్డి, తాగునీటి సౌకర్యం, విద్యార్హత, వృత్తి, వ్యవసాయం, ఇతర వివరాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తారన్నారు. సాంఘిక సంక్షేమ అధికారులతో రెవెన్యూ శాఖ వివరాలను తనిఖీ చేస్తారని ఆయన తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి : ఆరుగురు అరెస్ట్

పెదవేగి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరంపై దాడిచేసి ఆరుగురిని అరెస్టు చేశామని ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. కొండలరావుపాలెంలో ఆదివారం రాత్రి పేకాడుతున్నారనే సమాచారంతో దాడి చేశామన్నారు. ఈ దాడిలో ఆరుగురు జూదరులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.5490 నగదు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన చెప్పారు. జూదరులను కోర్టులో హాజరు పర్చుతామని తెలిపారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

అంబేడ్కర్‌పై వ్యాఖ్యలకు నిరసనగా వామపక్షాల ఆందోళన



ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న వామపక్షాల నాయకులు, కార్యకర్తలు

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు సాక్షిగా కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌ను అవమానపరచడంపై వామపక్షాలు భగ్గుమన్నాయి. అమిత్‌షా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని, లేకుంటే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ పాతబస్టాండ్ సెంటర్‌లో సోమవారం వామపక్షాల నాయకులు, కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, ఎస్.నాగరాజు, తలారి ప్రకాష్ మాట్లాడుతూ పార్లమెంటులో అంబేడ్కర్‌పై అమిత్‌షా అహంకార పూరిత వ్యాఖ్యలను ఖండించారు. 75 ఏళ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరుగుతున్న సమయంలో రాజ్యాంగ నిర్మాతను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. దేశానికి మనువాద మతోన్మాద భావజాలం ప్రమాదకరంగా మారిందన్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో దళిత, గిరిజన మహిళలపైన, మైనార్టీలపైన దుర్మార్గమైన దాడులు, అవమానాలు జరుగుతున్నా ఏమాత్రం మాట్లాడని ప్రధాని మోదీ అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షాను వెనుకేసుకురావడం దుర్మార్గం అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు, ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, సీపీఎం నాయకులు డీఎన్‌వీడీ.ప్రసాద్, కె.శ్రీనివాస్, బద్దా వెంకట్రావు, పుప్పాల కన్నబాబు, యర్రా శ్రీనివాసరావు, జి.రవికిశోర్, ఎం.అంజనేయులు, మహిళా ప్రతినిధులు అడ్డగర్ల లక్ష్మి, ఇందిర, మావూరి విజయ, శ్యామల, యామిని, శ్యామలరాణి, శారద పాల్గొన్నారు.

● కామవరపుకోట: అంబేడ్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై తగు చర్యలు తీసుకోవాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం సీపీఐ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. టీవీఎస్.రాజు, దుర్గారావు, సత్యనారాయణ, రమణ, కంకిపాటి బుచ్చిబాబు, శ్రీనివాసరావు, రాములమ్మ పాల్గొన్నారు.

● చింతలపూడి: అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలపై వామపక్షాలు నిరసన తెలిపాయి. పాత బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి బోసుబొమ్మ సెంటర్ వరకు ప్రదర్శన జరిపారు. అక్కడ ధర్నా చేస్తూ పలువురు మాట్లాడారు. కంచర్ల గురవయ్య, ఆర్వీ ఎస్.నారాయణ, సూర్యకుమార్, వరలక్ష్మిదేవి, టి.బాబు, ఎస్.కె.కాలేషా పాల్గొన్నారు.

● ఏలూరు: పోలవరం మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. సొబ్బన మోహన్, కారం భాస్కర్, మడివి చలపతి, మిడియం పండుదొర, కుంజం నాగబాబు, కాకి బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తక్షణమే భర్తరఫ్ చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఎం, సీపీఐ డిమాండ్ చేశాయి. మండల కేంద్రంలో వామపక్షాలు భారీ ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటరులో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ.భూషణం, టి.రామకృష్ణ, టి.బాబురావు, చోడెం దుర్గ, బేతి కిశోర్, పి.రాజు, రామిరెడ్డి, బుల్లెమ్మ, శ్రీనివాసరావు, కన్నారెడ్డి, అర్జున్‌రావు, గంగిరెడ్డి, ముత్యాలమ్మ, నాగరత్నం, నాగమణి, గంగాదేవి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు: జంగారెడ్డిగూడెం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కె.వి రమణ, సూర్యారావు, రాంబాబు, సుభానీ, రమణరాజు, కుంచె వసంతరావు, కె.విజ్ఞేష్, జొన్నపూడి వెంకటే శ్వరరావు, ఎస్.రామ్మోహన్, భూషణం, కె.రామలక్ష్మి, ఎం.లక్ష్మి, బొడ్డువాసు, ఎం.జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని వామపక్షాల నేతలు నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం, సీపీఐ నేతలు బుయ్యన శ్రీను, ఎం.వెంకటాచారి, ఎం.బాబు, మహ బూబ్ బాష, రమేష్, కొన్నే లక్ష్మయ్య, బాబురావు సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు చంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన ఆక్వా రైతులు

ఆక్వా రైతులకు నాబార్డు రుణాలు

గోదావరి జిల్లాల ఆక్వా ప్రాంతీయ సదస్సులో నాబార్డు, మత్స్యశాఖ అధికారులు

రాజమహేంద్రవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆక్వారంగంలో చిన్న, మధ్యతరగతి రైతులతోపాటు కార్పొరేట్ రంగానికి నాబార్డు రుణాలు ఇస్తున్నట్టు నాబార్డు సీజీఎం ఎం.ఆర్.గోపాల్ తెలిపారు. స్థానిక లాహాస్పిన్‌లో సోమవారం మత్స్యశాఖ, నాబార్డు ఆధ్వర్యంలో జరిగిన గోదావరి జిల్లాల ఆక్వా రైతుల ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. చేపలు, రొయ్యల సాగు చేస్తున్న రైతులకు నాబార్డు ఆసరాగా ఉందన్నారు. భారతదేశంలో రొయ్యల పెంపకం, ప్రాసెసింగ్, ఎగుమతి రంగాలకు సంబంధించి నాబార్డు రుణాలు ఇవ్వడానికి వ్యూహ రచన చేస్తున్నట్టు చెప్పారు. రొయ్యల సంతానోత్పత్తికి న్యూక్లియస్ బ్రీడింగ్ కేంద్రాల స్థాపనకు ఆర్థిక సహాయం అవసరం ఉందని చెప్పారు. దేశంలో 70 శాతం ఆక్వా, మత్స్య ఉత్పత్తి ఆంధ్ర ప్రదేశ్‌లో ఉందన్నారు. రాష్ట్రంలో 974 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉండడం వల్ల ఫిషరీస్ ఎగుమతుల్లో రికార్డు స్థాయి వృద్ధి నమోదైందని చెప్పారు. చిన్నమధ్య, కార్పొరేట్ సంస్థలను ఈ రంగంలో ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. ప్రతి కుటుంబం నుంచి వ్యాపారవేత్తలు తయారీ లక్ష్యంతో సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర 2047లో భాగంగా పనిచేస్తున్నామని తెలిపారు. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లాల్ మహ్మద్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మాదిరిగా ఆక్వా కల్చర్‌లో కూడా కౌలు రైతులకు రుణాలివ్వడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టినట్టు చెప్పారు. గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలోనే 70 శాతం ఆక్వా కల్చర్ సాగు ఉందన్నారు. 54034 మంది రైతులకు విద్యుత్ రాయితీలు అందిస్తున్నట్టు చెప్పారు. ఆక్వాలో డ్రోన్ వినియోగం మొదలైందని, రొయ్యలతో పాటు పీతలకు మంచి డిమాండ్ ఉందన్నారు. నాబార్డు సీజీఎం (హెచ్‌వో) డా. ఏ.వి.భవానీ శంకర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఉత్పత్తిరంగంలో భారతదేశంలో రెండో స్థానంలో ఉండగా, రొయ్యల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందని చెప్పారు. భారత ప్రభుత్వం ఈ రంగానికి రూ.2600 కోట్లను టీఎంఎంఎస్‌వై కింద మంజూరు చేసిందన్నారు. దిగుమతి సుంకాన్ని 15 నుంచి 5 శాతానికి తగ్గించినట్టు చెప్పారు. ఎస్‌ఎల్‌బీసీ ఏజీఎం శ్రీనివాసదాస్యం మాట్లాడుతూ మత్స్య ఆక్వా రంగాల అభివృద్ధికి ఆయా రంగాల్లో పనిచేస్తున్న రైతులు, ఇతర యూనిట్ల సమస్యలను త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సదస్సులో ఏజీఎం ఎస్‌ఎల్‌బిసి శ్రీనివాస్, డా. ఏవీ.మాధురి, ఐసీఏఆర్ -సీఎంఎఫ్ఆర్ఐ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.జెకె. కిజాకుడన్, ఎంపీఈడీఏ జాయింట్ డైరెక్టర్ విజయకుమార్ ఎరగల్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కానిస్టేబుళ్ల పరీక్షలు: ఎస్పీ

ఏలూరు క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్ పోస్టుల భర్తీకోసం ఆంధ్రప్రదేశ్ పోలీస్ రిక్రూట్‌మెంట్‌బోర్డు జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఇప్పటికే ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత అయిన అభ్యర్థులకు సోమవారం నుంచి ఫిజికల్ మెజర్‌మెంట్‌పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ పరీక్షలు నిర్వహించడం ప్రారంభించామని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద సోమవారం ఉదయం మీడియాతో ఎస్పీ మాట్లాడారు. సోమవారం 600 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 309 మంది హాజరయ్యారు. వీరిలో 179 మంది అన్ని ఈవెంట్స్‌లో అర్హత సాధించారని చెప్పారు. మహిళా అభ్యర్థినులకు జనవరి 3,4 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించే ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని ప్రతి అంశాన్ని డ్రోన్ కెమెరా ద్వారా చిత్రీకరణ జరుపుతున్నామన్నారు. ఎటు వంటి అపోహ లకు తావులేకుండా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వైద్య పరమైన ఇబ్బందులు ఎదురైతే వెంటనే అస్వస్థతకు గురైన అభ్యర్థులను వెంటనే ఆసుపత్రికి తరలించడానికి రెండు అంబులెన్సులను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులకు 1600 మీటర్ల పరుగుపందెం నిర్వహిస్తామని దానిలో డిస్క్వాలిఫై అయితే మిగిలిన ఈవెంట్స్‌కు అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. జనవరి 9వ తేదీ వరకూ ఈవెంట్స్ కొనసాగుతాయని అభ్యర్థులు మినహా ఎట్టిపరిస్థితుల్లో ఎవరిని అనుమతించమని, ఎటు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు కూడా అభ్యర్థులు తీసుకురాకూడదని ఎస్పీ తెలిపారు.

తహసీల్దార్‌పై ఫిర్యాదు: సబ్ కలెక్టర్ విచారణ



తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

చాట్రాయి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): చాట్రాయి తహసీల్దార్ ప్రశాంతి అవకతవకలకు పాల్పడుతున్నారని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కల్లేపల్లి ప్రభాకరరావు ఇచ్చిన ఫిర్యాదుపై సోమవారం సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ చాట్రాయి తహసీల్దార్ కార్యాలయంలో విచారణ జరిపారు. కొంత మందికి అక్రమంగా పాస్ పుస్తకాలు జారీ చేశారని, అర్హత లేకపోయినా సరైన ధ్రువపత్రాలు లేకపోయిన మరికొందరికి ఆన్‌లైన్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు పేర్కొన్న వ్యక్తుల నుండి సబ్ కలెక్టర్ వివరాలు అడిగితెలుసుకొని రికార్డులు పరిశీలించారు.

అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలి

నూజివీడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ పట్ల అవమానకరంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నూజివీడు సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు చలసాని వెంకటరామారావు, రైతు సంఘం ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు, సీనియర్ నాయకులు నందూరి హనుమాన్లు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో ట్రిపుల్‌ఐటీ విద్యార్థి ప్రతిభ

నూజివీడు టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భువనేశ్వర్‌లోని కిట్ యూనివర్శిటీలో నిర్వహించిన అంతర్ విశ్వవిద్యాలయ యోగాసన పోటీల్లో నూజివీడు ట్రిపుల్‌ఐటీకి చెందిన విద్యార్థి దుర్గాప్రసాద్ రిథమిక్ యోగా విభాగంలో తృతీయస్థానంలో నిలిచినట్టు రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ తెలిపారు. దాదాపు 200కు పైగా విశ్వవిద్యాలయాలు ఈ పోటీల్లో పాల్గొనగా దుర్గాప్రసాద్ అత్యంత ప్రతిభా పాటవాలు కనబరిచి మూడోస్థానంలో నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా యోగాశిక్షకులు అక్కినేని సత్యశ్రీధర్‌ను అభినందించారు.



పనస చెక్కతో చేసిన పాదుకలను చూపుతున్న షేక్ మాబు

సచ్చిదానందకు పాదుకల బహూకరణ

నూజివీడు టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):గణపతి సచ్చిదానందస్వామిజీకి నూజివీడుకు చెందిన ప్రముఖ వీణల తయారీదారు షేక్ మాబు పాదుకలను అందించారు. నూజివీడు దత్తాశ్రమానికి గణపతి సచ్చిదానందస్వామిజీ రాగా ఆయనను కలిసిన షేక్ మాబు తాను స్వయంగా పనస చెక్కతో తయారుచేసిన పాదుకలను బహూకరించారు.

పది మంది పాత నేరస్తులకు బైండోవర్

ముసునూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన పాత ముద్దాయిలను ముసునూరు తహసీల్దార్ పురుషోత్తమశర్మ ఎదుట ఎక్సైజ్ పోలీసులు సోమవారం బైండోవర్ చేశారు. ఎస్ఐ ఏ.మస్తానయ్య ఆధ్వర్యంలో ముసునూరుకు చెందిన పంజుగల వెంకట నరసమ్మ, వీరంకి రజిని, చెక్కపల్లికి చెందిన కంపసాటి శ్రీనివాసరావు, కాట్రేనిపాడుకు చెందిన గండికోట రాటాలు, గుత్తి శ్రీరావమ్మా, గుత్తి వెంకటేశ్వరరావు, సొంగ ధనలక్ష్మీ, సొంగ సరోజినీ, బొట్ల రవి, సొంగ మహేష్‌లను 129 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ ప్రకారం మరలా ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే లక్ష రూపాయలు జరిమానాతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను రద్దు చేసేలా తహసీల్దార్ శర్మ ఎదుట బైండోవర్ చేసి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.



ముదినేపల్లి మండలం వడాలి, కలిదిండి మండలం అమరావతి రెవెన్యూ సదస్సులలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

ముదినేపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోర్టు లావాదేవీల్లో ఉన్న వివాదాలకు సంబంధించిన సమస్యలు తప్ప రైతులెదుర్కొంటున్న భూముల సరిహద్దు తగాదాలు, విస్తీర్ణంలో తేడాలపై వస్తున్న ప్రతీ అర్జీని పరిష్కరిస్తామని ముదినేపల్లి మండల ప్రత్యేకాధికారి పి.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని వడాలి, కోమర్రు గ్రామాల్లో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ రీ సర్వే వల్ల జరిగిన పొరపాట్లను కూడ సరి చేస్తామని తెలిపారు. వడాలిలో దేవస్థానంకు చెందిన 1206 టైటిల్ డీడ్‌కు సంబంధించిన 482 ఎకరాల భూములపై 2016 వరకు తమకున్న శాశ్వత జిరాయితీ హక్కులను పునరుద్ధరించాలని రైతులు సోమేరు, గంగాధర్‌రావు అర్జీలు అందజేశారు. సర్పంచ్ మరీదు దుర్గా శ్రీ, పెదగొన్నూరు నీటి సంఘం ఉపాధ్యక్షుడు కట్టా కోటేశ్వరరావు, జగన్నాథ స్వామి దేవస్థానం ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు, రీ సర్వే డిటి శ్రీనివాస వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● కలిదిండి: మండలంలోని అమరావతి గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు భూ సమస్యలపై 25 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. సర్పంచ్ పెరుమాళ్ల భోగేశ్వరరావు, కూటమి నాయకులు గండికోట వెంకటేశ్వరరావు, ఆర్ఐ శ్యామల, సర్వేయర్ ఎం.షమి, వీఆర్వోలు పాల్గొన్నారు.

● మండవల్లి: గ్రామ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గోపాల్ సూచించారు. మండలంలోని లింగాల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు తమ భూములకు సంబంధించిన రికార్డులు, ఆన్‌లైన్ సమస్యలు, సరిహద్దు సమస్యలపై రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సదస్సులో సబ్ డివిజన్ కోరుతూ 2 అర్జీలు, పాస్‌పుస్తకాల కొరకు 3 అర్జీలు వచ్చినట్లు ఆర్ఐ శ్రావణి తెలిపారు.



కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

కుక్కల బెడదకు చెక్

400 కుక్కలు పట్టివేత

ముదినేపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కొండముచ్చులను ప్రయోగించి గ్రామంలో కోతుల బెడదను వదిలించిన ముదినేపల్లి గ్రామపంచాయతీ అధికారులు కుక్కలను పట్టించే పనిలో పడ్డారు. గ్రామంలో వందల సంఖ్యలో కుక్కలు స్వైర విహారం చేస్తూ జనంపై విచక్షణారహితంగా దాడి చేస్తున్నాయని గ్రామస్తులు హడలిపోతున్నారు. కుక్కలను పట్టించాలని గ్రామస్థులు చాలా కాలంగా మొరపెట్టుకుంటున్న నేపథ్యంలో రెండు రోజులుగా గ్రామంలో కుక్కలను పట్టుకునే చర్యలు చేపట్టారు. గుంటూరు నుంచి కుక్కలను పట్టి తీసుకెళ్లే వారిని రప్పించి ముదినేపల్లిలో ఆది, సోమవారాల్లో 400 కుక్కలను సజీవంగా పట్టించారు. ఒక్కొక్క కుక్కను పట్టి తీసుకెళ్లేందుకు రూ.250, ఇతర ఖర్చులకు సుమారు రూ.లక్షా 20 వేలు వ్యయమైంది.

తెలుగు రచయితల మహాసభల్లో చింతపల్లికి సన్మానం



అధ్యక్షుడిగా ఎన్నికైన ఏడుకొండలుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

కైకలూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు రచయితల మహాసభకు కైకలూరుకు చెందిన సాహితి మిత్రుల ప్రధాన కార్యదర్శి చింతపల్లి వెంకటనారాయణ పాల్గొన్నారు. ఇటీవల విజయవాడ కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో జరిగిన మహాసభ ల్లో ఘనంగా సత్కరించారు. ఆయన రచనలు, తెలుగుభాష మనుగడకు, పరిరక్షణ, వికాసానికి అవిశ్రాంత సేవలకు చిహ్నంగా ఘనంగా సత్కరించి మెమెంటో, ప్రశంసాపత్రాన్ని బహూకరించారు. ప్రపంచ తెలుగు మహాసభల గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్, గౌరవ కార్యనిర్వాహక అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు గుత్తికుండా సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి జీవీ.పూర్ణచందు, కృష్ణాజిల్లా రచయితల సంఘం, తదితరులు పాల్గొన్నారు.

పెదపుట్లపూడి ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడిగా ఏడుకొండలు



ఏడుకొండలుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

కలిదిండి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెదపుట్లపూడి ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడిగా నడకుదుటి ఏడుకొండలు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా నడకుదుటి గోపాలరావు, కార్యదర్శిగా శివకృష్ణను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి ఎం.భవిత వీరికి నియామక పత్రాలు అందజేశారు. ఎంపికైన వారికి అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్, కూటమి నాయకులు వడుగు గోపాలరావు, సామోరు, నడకుదుటి గణపతి, కొక్కిలిగడ్డ అంజిబాబు, నాగరాజు, ఆనందరావు, శారదరావు, గ్రామ పెద్దలు, తదితరులు అభినందనలు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి



చాట్రాయి మండల సమావేశంలో మాట్లాడుతున్న ఏవో

చాట్రాయి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ లంకా నిర్మల కోరారు. చాట్రాయి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ చనుబండలో పీహెచ్‌సీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరైనా స్థలం ఖరారు కాకపోవటంతో జాప్యం జరుగుతున్నదని, చాట్రాయి పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరటంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయలేక పోతున్నామని, ప్రజల ఆరోగ్యంపై ఇంటింటి సర్వే జరుగుతున్నదని వివరించారు. విద్యుత్ ఏఈ సంజయ్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం కింద ఎస్సీ ఎస్టీలకు ఉచితంగా సోలార్ విద్యుత్ యూనిట్లు మంజూరు చేస్తున్నామని అన్నారు. ఏవో శివశంకర్, ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవో బ్రహ్మచారి, వైస్ ఎంపీపీలు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత నరసింహారావు మృతి



చాట్రాయి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు, చిన్నంపేట మాజీ సర్పంచ్ అత్తులూరి నరసింహారావు(84) సోమవారం కన్నుమూశారు. కొంత కాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. 11 ఏళ్ళు సర్పంచ్‌గా, రెండుసార్లు మండల టీడీపీ అధ్యక్షుడుగా పని చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పలు పార్టీల నాయకులు నరసింహారావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

పిచ్చికుక్క స్వైర విహారం

19 మందికి గాయాలు



మద్దాల కుమారి, పూజిత

ముసునూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముసునూరులో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. సోమవారం ఎస్సీ, బీసీ కాలనీల్లో పిల్లలు, వృద్ధులు, మహిళలపై విచక్షణ రహితంగా పిచ్చికుక్క దాడి చేయడంతో 19మంది తీవ్ర గాయాల పాలయ్యారు. ఎస్సీకాలనీకి చెందిన ఆశావర్కర్ మద్దాల కుమారిపై పిచ్చికుక్క దాడి చేయడంతో ఆమె కుడికన్నుకు తీవ్ర గాయం కావడంతో 108 వాహనంపై విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరికొందరిపై కూడా పిచ్చి కుక్క దాడి చేయండంతో బాధితులకు ముసునూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి షకీనా ఇవాంజలి, వైద్యసిబ్బంది చికిత్స అందించారు. స్థానికులు పిచ్చికుక్కను హతమార్చారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

నూజివీడు టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):నూజివీడు నియోజకవర్గ పరిధిలో మిర్చి పంటపై నల్లిపురుగు, తామర పురుగుల ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని సీపీఐ అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కు మిర్చిపై వచ్చిన బొబ్బర తెగులు, తామర పురుగుల ఉధృతిని రాష్ట్ర విపత్తుగా గుర్తించి రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చలసాని వెంకటరామారావు కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, జిల్లా నాయకులు నిమ్మగడ్డ నరసింహా, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కోటపాడులో సీసీ రోడ్డు నిర్మాణ పనులు

చాట్రాయి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కోటపాడులో ఉపాధిహామీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. బొంతు బుజ్జిబాబు ఇంటి వద్ద నుంచి శ్రీనివాసరావు ఇంటి వరకు 180 మీటర్లు సీసీ పనులు చేపట్టారు. సీకే పాడు నీటి సంఘం అధ్యక్షుడు మంచిన పూర్ణచంద్రరావు పనులను పర్యవేక్షిస్తున్నారు.

ఫొటోగ్రాఫర్స్ అధ్యక్షుడిగా రామారావు



చాట్రాయి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా సవరం రామారావు ఎన్నికయ్యారు. చాట్రాయిలో సోమవారం ఎన్నిక నిర్వహించారు. ఉపాధ్యక్షుడుగా ప్రభాకరరావు, సెక్రటరీగా సుమన్, జాయింట్ సెక్రటరీగా కేశవ, ట్రెజరర్‌గా మురళి, 8 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికైనట్లు ప్రకటించారు.

టీటీలో హేపీ వ్యాలీ విద్యార్థికి రన్నరప్



విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఆగిరిపల్లిలోని హ్యాపీ వ్యాలీ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఎ. అభిరామ్ అండర్-15 బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా అభిరామ్‌ను స్కూల్ ఛైర్మన్ కె కోటేశ్వరరావు, డీన్ రఘురామ్, డైరెక్టర్లు కె.అవినాష్, కె శ్రీతేజ, కోచ్ బొడ్డు శ్రీనివాస్ అభినందించారు.

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

చాట్రాయి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శన(ఎస్ఐఎస్ఎఫ్)-2025లో భాగంగా జిల్లాస్థాయి పోటీలకు చాట్రాయి మండలం నుంచి మూడు విభాగాలకు విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఎంఈవో బ్రహ్మచారి చెప్పారు. చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో జరిగిన ఎగ్జిబిషన్‌లో భౌతిక శాస్త్రంలో సిగుడిపాడు హైస్కూల్ నుంచి రెండు ప్రదర్శనలు, నీటి నిల్వపై పోలవరం హైస్కూల్ నుంచి ఒక ప్రదర్శన ఎంపిక చేశామన్నారు.

నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు పాటించాలి

కైకలూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం వేడుకల్లో నిబంధనలు పాటించాలని కైకలూరు టౌన్, రూరల్ సీఐలు పి కృష్ణ, వి.రవికుమార్ అన్నారు. సోమవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, భారీ సౌండ్‌సిస్టమ్స్, మద్యం సేవించి వాహనాలు నడపితే చర్యలు తప్పవన్నారు. సీసీ కెమెరాల ఆధారంగా కేసులు నమోదు చేస్తామన్నారు. నిబంధనలు ఎవరైనా అతిక్రమిస్తే రూ.10వేలు జరిమానా లేదా జైలుశిక్ష తప్పదన్నారు.

● కలిదిండి: న్యూ ఇయర్ వేడుకలను పురస్కరించుకుని జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటి ద్వారా రికార్డింగ్ చేసి పోలీస్ కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షిస్తామన్నారు.

సోమావతి అమావాస్య పూజలు

ముదినేపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శివాలయాల్లో సోమావతి అమావాస్య పూజలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అల్లూరు సోమేశ్వరస్వామి, గురజ, పెద కామనపూడి రామలింగేశ్వరస్వామి, సింగరాయపాలెం అమృతేశ్వరస్వామి, పెదగొన్నూరు మల్లేశ్వరస్వామి, వడాలి విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

పింఛన్ ఇప్పించండి

వృద్ధురాలి వేడుకోలు

ముదినేపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తన భర్త మృతి చెందారని, ఆయన వృద్ధాప్య పింఛన్ తన పేరుకు బదిలీ చేసి తనకు ఇప్పించాలని వృద్ధురాలు కోరుతోంది. నీ భర్త పింఛన్ అప్పట్లోనే రద్దయింది. నీవు పింఛన్ కోసం కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. వాడవల్లి గ్రామ సచివాలయం పరిధిలోని వి.రావిగుంటకు చెందిన బొడ్డు వీరాస్వామి గత జనవరిలో మరణించాడు. అతడి వృద్ధాప్య పింఛన్ భార్య నాంచారమ్మకు వితంతు పెన్షన్‌గా బదిలీ చేయాల్సి ఉంది. అప్పట్లో పెన్షన్ బదిలీ చేస్తామని వలంటీర్లు నాంచారమ్మ వేలిముద్రలు కూడ తీసుకున్నారు. కానీ పెన్షన్ మంజూరు కాలేదు. అధికారులు చర్యలు తీసుకుని తనకు పింఛన్ మంజూరు చేయాలని కోరుతోంది.

సీఎస్‌గా విజయానంద్ నియామకంపై నాయకుల హర్షం

కలిదిండి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌గా విజయానంద్ నియామకంపై టీడీపీ నాయకులు అంద్రాజు శ్రీనివాస్, గూడవల్లి శ్రీనివాసరావు, పోసిన పాండురంగారావు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. తొలి సారిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన అధికారి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కావడం అభినందనీయమన్నారు.

విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు

ముసునూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముసునూరు జడ్పీపాఠశాలలో మండలస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు సోమవారం జరిగాయి. విద్యాశాఖాధికారి బి.వి.యస్ సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు వివిధ రకాల సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో మూడు రకాల కేటగిరిల్లో ముసునూరు జడ్పీ పాఠశాల విద్యార్థి ప్రదర్శించిన ఎర్త్‌క్వేక్ అలారం నమూనా, గురుకుల పాఠశాల ఇద్దరు బాలికలు ప్రదర్శించిన మైక్రోస్కోప్ వర్కింగ్ మోడల్ నమూనా, చెక్కపల్లి జడ్పీపాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సోలార్ పేనల్స్ నమూనాలు ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఎంఈవో తెలిపారు. వీరు త్వరలో జరిగే జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శ పోటీల్లో పాల్గొంటారని ఆయన చెప్పారు.

ముగిసిన అండర్ -16 కబడ్డీ పోటీలు

ఆగిరిపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి హీల్‌ప్యారడైజ్ ఆవరణలో సీహెచ్‌సీఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన కబడ్డీపోటీలు ముగిశాయి. ఈ పోటీల్లో తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి అండర్ -16, బాలబాలికల జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో మధురైజట్టు ప్రథమస్థానం, చెన్నై జట్టు ద్వితీయస్థానం, బెంగళూరు జట్టు తృతీయస్థానం సాధించగా, బాలికల విభాగంలో చెన్నైజట్టు ప్రథమస్థానం, బెంగళూరు జట్టు ద్వితీయ స్థానం, నాగపూర్‌జట్టు తృతీయస్థానాలు సాధించాయి. పోటీల ముగింపు సమావేశానికి మైక్రాన్ టెక్నాలజీస్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ మాకినేని శివ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

'రీసర్వేతో ఇబ్బందులు పడుతున్నాం'

చాట్రాయి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో జరిగిన భూముల రీసర్వే అస్తవ్యస్తంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నమని సోమవారం జరిగిన కొత్తగూడెం రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ చల్లగుళ్ళ రాజారత్నం తదితరులు మాట్లాడుతూ అనుభవంలో ఉన్న రైతులను పిలవకుండా తమకు సర్వేరాళ్ళు వేశారని, గతంలో ఉన్న సరిహద్దులకు ప్రస్తుతం వేసిన సర్వే రాళ్ళకు తేడా వచ్చిందని, ఫలితం కొంత మంది భూములు తగ్గటం మరికొంత మందికి పెరగటం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గీత, సర్పంచ్ వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ జగన్మోహనరావు, టీడీపీ నాయకులు వెల్ది నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సభలు

ముసునూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ గ్రామసభలు సోమవారంతో ముగిశాయి. బలివే గ్రామంలో జరిగిన గ్రామసభలో రెండు అర్జీలు వచ్చినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తమశర్మ తెలిపారు. 15 రెవెన్యూ గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో 289 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు శర్మ చెప్పారు. ఆర్ఐ దీపిక, ఈవోపీఆర్డీ బి.ఏ సత్యనారయణ, వీఆర్వో మహేంద్రరావు, సిబ్బంది పాల్గొన్నారు.